ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రతలు గరిష్ఠం: 38.0 , కనిష్ఠం: 27.0
ANDHRAJYOTHY
1
నారాయణపేట
జిల్లా వార్తలు
ఆదివారం 4 మే 2025



వెల్కిచర్లలో మహిళ దారుణ హత్య

- కత్తితో మెడ, ఛాతిపై పొడిచిన దుండగులు
- సంఘటన స్థలాన్ని పరిశీలించిన సీఐ రామకృష్ణ

3

పాలమూరుకు.. ట్రిపుల్ ఐటీ

- రెండు లేదా మూడు రోజుల్లో వెలువడనున్న ఉత్తర్వులు
- స్థల పరిశీలన చేసిన బాసర ట్రిపుల్ ఐటీ వైస్ ఛాన్సలర్
- న్యాయ, ఇంజనీరింగ్ కళాశాలలు ఇప్పటికే మంజూరు
- కళాశాల ఏర్పాటుకు 50 ఎకరాల స్థలం అవసరం



రాజబహదూర్ రెడ్డి హాస్టల్ సమీపంలో స్థల పరిశీలన చేస్తున్న ఎమ్మెల్యే, వీసీ, అధికారులు

మహబూబ్‌నగర్, మే 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పాలమూరు విద్యా కిరీటంలో మరో కలికితురాయి చేరనుంది. ఇప్పటికే పాలమూరుకు న్యాయ, ఇంజనీరింగ్ కళాశాలలు, ఏటీసీ, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ మంజూరు కాగా, త్వరలో ట్రిపుల్ ఐటీ కళాశాల మంజూరు కానుంది. ఇందుకు సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వులు రెండు లేదా మూడు రోజుల్లో వచ్చే అవకాశం ఉంది. ఈ మేరకు బాసర ట్రిపుల్ ఐటీ వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్ ఆధ్వర్యంలో శనివారం పలుచోట్ల స్థల పరిశీలన చేశారు. తెలంగాణలో ఇప్పటివరకు రెండు మాత్రమే ట్రిపుల్ ఐటీలు ఉన్నాయి. అవి కూడా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఉన్న సమయంలో ఏర్పాటు చేసినవే. అయితే స్వరాష్ట్రం ఏర్పడిన తర్వాత దక్షిణ తెలంగాణ ప్రాంతంలో ఒక ట్రిపుల్ ఐటీ ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన ఉండేది. కానీ జేఎన్‌టీయూ ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ కాలేజీల ఏర్పాటుకు గత ప్రభుత్వం ప్రాధాన్యం ఇచ్చింది. ఈ క్రమంలోనే వనపర్తిలో ఒక జేఎన్‌టీయూ కళాశాలను ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇంజనీరింగ్ కాలేజీల సంఖ్య ఉమ్మడి పాలమూరు జిల్లాలో తక్కువగా ఉండటం, పాలమూరు యూనివర్సిటీకి ప్రత్యేకంగా ఇంజనీరింగ్ కాలేజీ లేకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం పీయూకు అనుబంధంగా ఇంజనీరింగ్ కాలేజీని మంజూరు చేసింది. ఈ విద్యా సంవత్సరం నుంచి అందులో తరగతులు కూడా ప్రారంభం కానున్నాయి. దీంతోపాటు ఉమ్మడి పాలమూరు జిల్లాలో ప్రభుత్వ న్యాయ కళాశాల లేకపోవడంతో దాన్ని కూడా పీయూకు అనుబంధంగా ఏర్పాటు చేసి, ఈ ఏడాది నుంచి తరగతులు ప్రారంభించనున్నారు. తాజాగా పాలమూరుకు ట్రిపుల్ ఐటీ మంజూరు కానుండటంతో విద్యార్థులకు మేలు జరగనుంది.

కష్టం ఫలించింది

పాలమూరులో ఒక జాతీయ స్థాయి విద్యా సంస్థ నెలకొల్పుతానని ఎన్నికల్లో ప్రజలకు హామీ ఇచ్చాను. ఇప్పుడు ఆ హామీ నెరవేరేందుకు మార్గం సుగుమమైంది. రెండు మూడు రోజుల్లో జీవో వెలువడుతుంది. ఈ మేరకు బాసర ట్రిపుల్ ఐటీ వీసీ స్థల పరిశీలన కూడా చేశారు. ఇప్పటికే పాలమూరుకు న్యాయ కళాశాల, ఇంజనీరింగ్ కాలేజీ మంజూరయ్యాయి. ఈ కళాశాల ఏర్పాటు కోసం చేసిన కష్టం ఫలిస్తోంది. సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నందుకు ఆయన ధన్యవాదాలు.

\- యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే

మారనున్న ముఖచిత్రం..

ఇప్పటికే మహబూబ్‌నగర్‌లో ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఉండగా.. ఇంజనీరింగ్, లా కాలేజీలు మంజూరయ్యాయి. దీంతోపాటు అడ్వాన్స్‌డ్ నాలెడ్జ్ సెంటర్లు, స్టడీ హాళ్లు, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లు మంజూరయ్యాయి. ఒక ఇంటిగ్రేడ్ రెసిడెన్షియల్ స్కూల్ కూడా మంజూరైంది. తాజాగా ట్రిపుల్ ఐటీకి స్థల పరిశీలన చేయడంతో రానున్న రోజుల్లో

(మిగతా 3లో..)

16న పిల్లలమర్రికి మిస్ వరల్డ్ పోటీదారులు

- వారి రాక సందర్భంగా మూడంచెల భద్రత ఏర్పాటు
- మల్టీ జోన్-2 ఐజీ సత్యనారాయణ
- పిల్లల మర్రిని పరిశీలించిన అధికారులు




పిల్లలమర్రిలో భద్రతా ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఐజీ సత్యనారాయణ

మహబూబ్‌నగర్ న్యూటౌన్, మే 3 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రసిద్ధిగాంచిన మహబూబ్‌నగర్‌లోని పిల్లల మర్రిని సందర్శించేందుకు ఈ నెల 16న 22 దేశాల సుందరీమణులు రానున్నారని మల్టీ జోన్-2 ఐజీ సత్యనారాయణ తెలిపారు. పిల్లలమర్రి పర్యాటక క్షేత్రాన్ని శనివారం సాయంత్రం ఆయన డీఐజీ ఎల్ చౌహాన్, జిల్లా ఎస్పీ డి జానకి, అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఐజీ మాట్లాడుతూ హైదరాబాద్‌లో ఈ నెల 10 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించే 72వ మిస్ వరల్డ్ పోటీల సందర్భంగా 22 దేశాలకు చెందిన సుందరీమణులు పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ అందాల పోటీలలో పాల్గొనే సుందరిమణులు ఈ నెల 16 సాయంత్రం పిల్లలమర్రి మహావృక్షాన్ని సందర్శించనున్నారని చెప్పారు. వారి రాక సందర్భంగా పోలీసు శాఖ మూడంచెల భద్రతను ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. వారి సందర్శనను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని సుమారు వెయ్యిమంది పోలీసులతో పటిష్ఠ భద్రతను ఏర్పాటు చేస్తామన్నారు. హైదరాబాద్ నుంచి మహబూబ్‌నగర్ వరకు ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా అధికారులు పర్యవేక్షణ చేస్తారన్నారు. డీఎస్పీ వెంకటేశ్వర్లు, రూరల్ సీఐ గాంధీనాయక్, ట్రాఫిక్ సీఐ భగవంత్ రెడ్డి, ఇతర అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మిల్లర్ల జాప్యం.. రైతుకు కష్టం

- హమాలీల కొరతతో రైస్ మిల్లుల వద్ద దించుకోని ధాన్యం
- రోజుల తరబడి రోడ్లపై పడిగాపులు

నర్వ, మే 3(ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా నర్వ మండలం రాంపూర్ గేట్ సమీపంలోని సాయిరాం రైస్ మిల్లు వద్ద ధాన్యం దించుకోకపోవడంతో వాహనాలు మూడు కిలో మీటర్ల మేర బారులు తీరాయి. మూడు నుంచి నాలుగు రోజులుగా రైతులు వాహనాలను రోడ్డు పక్కన నిలిపి, పడిగాపులు కాస్తున్నారు. ధాన్యం అన్‌లోడింగ్ చేయడానికి సరిపోను హమాలీలు తక్కువ మంది ఉండడం వల్ల ఈ సమస్య ఏర్పడిందని, దీనంతటికి కారణం రైస్ మిల్లు యజమానులేనని రైతులు వాపోతున్నారు. ధాన్యం సకాలంలో దించుకోకపోవడంతో రాంపూర్ గేట్ నుంచి చిత్తనూరు గుట్ట వరకు దాదాపు మూడు కిలో మీటర్ల మేర రహదారిపై వాహనాలు నిలిచిపోయాయి. అవి నర్వ, మక్తల్ మండలాల కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యం బస్తాలతో వచ్చాయి. 250కి పైగా లారీలు, ట్రాక్టర్లు వరుసలో నిలిచిపోయాయి. దాంతో రైతులు ఎండకు తాళలేక రోడ్డుపైన వాహనాల కింద పడిగాపులు కాస్తున్నారు. మా బాధలు ఎవరికీ కనిపిస్త లేవా? అంటూ ప్రశ్నిస్తున్నారు. ఎమ్మెల్యే, కలెక్టర్ చర్యలు తీసుకుని అన్‌లౌడ్ అయ్యేలా చూడాలని కోరుతున్నారు. మరోవైపు మిల్లర్లు ధాన్యం తేమ శాతం ఉందని ఒక్కో బస్తాపై రెండు నుంచి మూడు కిలోల వరకు తరుగు తీస్తున్నారని వాపోతున్నారు.



రోడ్డు పక్కన బారులు తీరిన ధాన్యం లోడ్‌తో ఉన్న వాహనాలు



ట్రాక్టర్ కింద నీడకు నిద్రిస్తున్న రైతులు

కాంగ్రెస్ తప్పుడు ప్రచారం

- జన గణన విషయంలో కేంద్రానిది చారిత్రాత్మకమైన నిర్ణయం
- మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ



సమావేశంలో మాట్లాడుతున్న డీకే అరుణ

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, మే 3 (ఆంధ్రజ్యోతి): జన గణనతో పాటు కుల గణన చేయాలన్న ఎన్‌డీఏ ప్రభుత్వ నిర్ణయం చారిత్రాత్మకమైనదని, కానీ కాంగ్రెస్ చెప్పెనే. బీజేపీ ప్రభుత్వం కుల గణన చేపట్టిందని ప్రచారం చేయడం సుద్ధ తప్పని బీజేపీ మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ అన్నారు. జన, కుల గణన కేంద్ర ప్రభుత్వ పరిధిలోనిదని, ఆ విషయం రాష్ట్రం మరిచిపోయినట్లుందని అన్నారు. ఎన్నికల కోసమే ఇలాంటి తప్పుడు అంశాలను తెరపైకి తెస్తుందని చెప్పారు. పార్టీ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు పి.శ్రీనివాస్ రెడ్డితో కలిసి శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన కులగణన సర్వే ఓ తప్పుల తడక అని, సగం మంది ప్రజలు ఈ సర్వేలో పాల్గొనలేదని అన్నారు. మతపరమైన రిజర్వేషన్లు కోరడం కాంగ్రెస్ కుట్ర అన్నారు. ముస్లింలను బీసీలలో చేర్చడం అంటే బీసీలను కాంగ్రెస్ మోసం చేసినట్లే కదా అన్నారు. బ్రిటీష్ పాలన(1931)లో కుల గణన జరిగిందని, కాంగ్రెస్ 60 ఏళ్ల పాలనలో ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. ముస్లింల ఓట్ల కోసమే కులగణన అంటోంది తప్పితే వాళ్లకి చిత్తశుద్ధి లేదని ఎద్దేవా చేశారు. బీసీల అభ్యున్నతికి పాటుపడుతున్నది ఒక్క బీజేపీయేనని ఆమె స్పష్టం చేశారు. కుల గణనకు మేమే ఆదర్శమంటూ కాంగ్రెస్ చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. ఇందిరమ్మ ఇళ్లు ఎమ్మెల్యే ఎవరికి చెపితే వారికే కేటాయిస్తున్నారని ప్రజల నుంచి ఫోన్లు వస్తున్నాయని, ఈవిషయంపై సీఎం రేవంత్ రెడ్డికి లేఖ రాస్తానని చెప్పారు. ఒక్కో ఎమ్మెల్యేకు 3,500 ఇళ్లు కేటాయిస్తున్నారంట అని, ఎంపీ కోటా కింద 7 అసెంబ్లీలు ఉన్నాయని ఎన్ని ఇళ్లు ఇస్తారో చెప్పాలను ఆమె డిమాండ్ చేసింది. ఇళ్ల కేటాయింపులో అర్హులకు అన్యాయం జరిగితే రోడ్డు ఎక్కవలసి వస్తుందని హెచ్చరించారు. ఎన్నికల ముందు ప్రజలకు, రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పద్మజారెడ్డి, పడాకుల బాలరాజు, సీనియర్ నాయకులు పాండురంగారెడ్డి పాల్గొన్నారు.

నీట్‌కు సర్వం సిద్ధం

- మహబూబ్‌నగర్ జిల్లాలో 13 కేంద్రాల ఏర్పాటు
- హాజరు కానున్న 4,454 మంది విద్యార్థులు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, మే 3 (ఆంధ్రజ్యోతి): ఎంబీబీఎస్, బీడీఎస్, అండర్ గ్రాడ్యుయేషన్ ప్రవేశాల కోసం జాతీయ స్థాయిలో ఆదివారం నిర్వహించనున్న నీట్(నేషనల్ ఎలిజిబులిటీ కమ్ ఎంట్రెన్స్ టెస్ట్) 2025 పరీక్షలకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. పరీక్షకు మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో 11, జడ్చర్ల, హన్వాడలలో ఒక్కోటి చొప్పున కేంద్రాలను ఏర్పాటు చేశారు.



పరీక్షల ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్ష జరుగనుంది. 4,454 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. విద్యార్థులను కేంద్రాల్లోకి ఉదయం 11 గంటల నుంచే అనుమతించనున్నారు. మధ్యాహ్నం 1:30 తర్వాత అనుమతించరు. కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు. విద్యార్థులను క్షుణ్ణంగా పరిశీలించి, బయోమెట్రిక్ తీసుకొని కేంద్రాల్లోకి అనుమతిస్తారు. అడ్మిట్ కార్డులో ఉన్న సూచనలు పాటించాలి. ఆభరణాలు, భారీ దుస్తులు, బూట్లు ధరించకూడదు. ఇటీవల దిగిన పాస్‌పోర్ట్ సైజు ఫొటో తేవాలి. గుర్తింపు కోసం ఆధార్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, కళాశాల జారీ చేసిన గుర్తింపు కార్డు లేదంటే ఇతర ఏదో ఒకటి ఫొటోతో ఉన్నకార్డు తప్పని సరిగా తేవాలి. పెన్ను కేంద్రంలోనే ఇస్తారు. నిర్వహణకు 20 మంది పరిశీలకులు, 372 మంది ఇన్విజిలేటర్లను నియమించారు.



బైక్‌పై ప్రమాదకరంగా ప్రయాణిస్తున్న ఆరుగురు

ప్రమాద ప్రయాణం

క్లిక్.. క్లిక్..

బైక్‌పై ట్రిపుల్ రైడింగ్ చేయొద్దు.. హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనం నడుపొద్దు.. అని ట్రాఫిక్ పోలీసులు చెబుతున్నా చాలా మంది పెడచెవిన పెడుతున్నారు. శనివారం నారాయణపేట నుంచి కోటకొండ వైపు బైక్‌పై ఇద్దరు చిన్నారులు సహా ఆరు మంది వెళ్లడం కనిపించింది. బైక్ నడిపే అతను హెల్మెట్ ధరించ లేదు. వెనుక కూర్చున్న ఇద్దరు మహిళలు ఇద్దరు చిన్నారులను కూర్చోపెట్టుకొని, పైగా మళ్లీ సామగ్రి, మూటలు పట్టుకున్నారు. ఏ చిన్న పొరపాటు జరిగినా ప్రమాదం జరిగేందుకు ఆస్కారం ఉంది. ఇంటింటికి తిరుగుతూ గిన్నెలు అమ్ముకొని జీవించే వీరు నారాయణపేట శివారులో పూరి గుడిసెల్లో నివాసం ఉంటున్నారు. ఈ ఫొటో చూస్తుంటే.. కూటి కోసం కోటి తిప్పలు అనే సామెత గుర్తొస్తుంది కదూ! కూడు తరువాత.. ముందు ప్రాణం జాగ్రత్త!!

\- నారాయణపేట

ఊట్కూర్‌లో బాలుడికి డెంగీ

- అప్రమత్తమైన వైద్య సిబ్బంది
- పరిసరాల్లో దోమల నివారణ మందు పిచికారి
- చుట్టుపక్కల 50 ఇళ్లల్లో డెంగీ సర్వే

3



నిల్వ ఉన్న నీటిని పారబోస్తున్న సిబ్బంది



మద్దూర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

దొడ్డురకం ధాన్యం తీసుకోవడానికి మిల్లర్ల నిరాకరణ

- నిరసనకు దిగిన రైతులు
- ఘటనా స్థలానికి చేరుకున్న డీటీ ఆనంద్
- మిల్లు యజమానిని ఒప్పించి ధాన్యాన్ని దింపించిన అధికారి

2

భగవంతుడి ఆరాధనతోనే
మానవ జన్మలో మోక్షం

- భాగవత సప్తాహ స్కంధ ప్రవచనంలో విద్వాన్ తుప్పసక్కిరి ప్రహ్లాదాచారి
- నరసాచలంలో కొనసాగుతున్న స్వర్ణోత్సవాలు
- విద్వాన్ మక్తల్ రాఘువేంద్ర చార్యులు


పల్లకీసేవ నిర్వహిస్తున్న అర్చకులు

నారాయణపేట రూరల్, మే 3 (ఆంధ్రజ్యోతి):భగవంతుడి ఆరాధనతోనే మానవ జన్మలో సద్గతి సాధ్యమౌతుందని హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ విద్వాన్ తుప్పసక్కిరి ప్రహ్లాదాచారి పేర్కొన్నారు. శనివారం నారాయణపేట మండలంలోని కోటకొండ నరసాచలంలోని భూలక్ష్మీవెంకటేశ్వర స్వామి స్వర్ణోత్సవాల్లో భాగంగా ఆరోరోజు ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో బృహతీ సహస్రయాగం నిర్వహించారు. భక్తులనుద్దేశించి ప్రహ్లాదాచార్యులు సప్తమ స్కంధంలోని ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. దైనందిన కార్యక్రమాలతో పాటు ఆధ్యాత్మిక చింతనకు ప్రతినిత్యం కొంత సమయమైనా కేటాయించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మక్తల్‌కు చెందిన విద్వాన్ రాఘవేంద్రా చార్యులు భక్తులనుద్దేశించి ప్రవచనం చేశారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండి నేటి యువత సైతం భక్తి మార్గంవైపు నడవాల్సిన గురుతర బాధ్యత ఉందన్నారు. అంతకు ముందు ప్రత్యేక పూజలు, పల్లకి సేవ నిర్వహించారు. గోవింద తీర్థ స్వాములు, నరసాచల సేవాసమితి సభ్యులు సీతారామారావు, జనార్దన్‌రావు, ప్రభంజన్‌రావు, జయతీర్థా చారి, శ్రీనివాస్, భరత్, హన్మేష్, ప్రకాశ్, శేషు తదితరులు పాల్గొన్నారు.

దంచికొట్టిన ఎండలు

- పెద్దమందడిలో 41.3 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత

వనపర్తి/గద్వాల/నారాయణపేట, మే 3 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా శనివారం ఎండ తీవ్రత పెరిగింది. దీంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడానికి భయపడ్డారు. వనపర్తి జిల్లా పెద్దమందడి మండ లంలో 41.3 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. అత్యల్పంగా రేవల్లి మండలం లో 24.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. జోగుళాంబ గద్వాల జిల్లా ఇటిక్యాల, అ యిజ లలో 41.1 డిగ్రీలు, గద్వాలలో 41, అలంపూర్‌లో 40.9, గట్టులో 40.7, కేటీదొడ్డిలో 40.5, ధరూర్‌లో 40.4, వడ్డేపల్లి, రాజోలి లలో 40.3 డిగ్రీలు నమోదైం ది. కనిష్ఠంగా 29.5 డిగ్రీలు నమోదైంది. మహబూబ్‌నగర్ జిల్లాలో గరిష్ఠంగా 40.7 డిగ్రీలు, కనిష్ఠంగా 25.5 డిగ్రీలు నమోదైంది. నారాయణపేట జిల్లాలో గరిష్ఠంగా 38 డిగ్రీలు, కనిష్ఠంగా 27 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. నాగర్‌కర్నూల్ జిల్లాలో గరిష్ఠంగా 37 డిగ్రీలు, కనిష్ఠంగా 26 డిగ్రీలు నమోదైంది.

దొడ్డురకం ధాన్యం తీసుకోవడానికి మిల్లర్ల నిరాకరణ

- నిరసనకు దిగిన రైతులు

మద్దూర్, మే 3 (ఆంధ్రజ్యోతి): దొడ్డు రకం ధాన్యాన్ని తీసుకోవడానికి మిల్లర్లు నిరాకరించడంతో మద్దూర్‌లో రైతులు శనివారం ఆందోళనకు చేశారు. ఐకేపీ ఆధ్వర్యంలో కొనుగోలు చేసిన ధాన్యాన్ని కాంటా చేసి దింపడానికి స్థానిక రైస్‌మిల్లులకు ట్రాక్టర్లతో రైతులు చేరు కోగా అక్కడ దింపు కోవడానికి మిల్లుల యజమానులు నిరాకరించారు. దీంతో రైతులు ఆందోళనకు దిగారు. మద్దూర్ మండలానికి సంబంధించిన ధాన్యం కోస్గిలోని బాయిల్డ్ రైస్‌మిల్లుకు కేటాయించారు. అక్కడ టార్గెట్‌పూర్తి కావడంతో తీసుకోకపోవడంతో స్థానిక రైస్‌మిల్లును రైతులు ఆశ్రయించారు. దీంతో దొడ్డు ధాన్యం చేయడానికి తమ మిల్లుకు అవకాశం లేదని, మిల్లర్లు స్పష్టం చేయడంతో రైతులు ఆందోళనకు దిగారు. ఇది తెలుసుకున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ ఆనంద్ సంఘటన స్థలానికి చేరుకొని పద్మావతి మిల్లు యజమానిని ఒప్పించి ధాన్యాన్ని దింపించారు. అలాగే మిగితా ట్రాక్టర్‌లను కూడా తీసుకు నేందుకు వేరే మిల్లర్లతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో రైతులు శాంతించారు.

తరుగు పేరుతో మోసం..

- గన్నీబ్యాగు తూకం పోను క్వింటాలుకు 2.5 కేజీల తరుగు తీస్తున్న నిర్వాహకులు
- చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు

గద్వాల, మే 3 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టపడుతున్న అన్నదాత మేలు ఎవరూ కోరుకోవడం లేదు. ఒకపక్క ప్రకృతి పగబట్టి అకాల వర్షంతో నష్ట పరుస్తోంది. మరోపక్క కొనుగోలు కేంద్రాల్లో తరుగు పేరిట కళ్లెదుటే దోపిడి చేస్తున్నా రైతు మౌనంగా ఉండిపోవాల్సిన పరిస్థితి జోగుళాంబ గద్వాల జిల్లాలో కనిపిస్తోంది. జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు మిల్లర్ల ప్రయోజనాలకే పనిచేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. నివారించాల్సిన అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడంతో రైతు మౌనంగా ఉండాల్సి వస్తోంది.


జమ్మిచేడులోని కొనుగోలు కేంద్రంలో కాంటా చేస్తున్న కూలీలు

తరుగు పేరిట దోపిడి..

జిల్లాలో 69 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఇందులో 50 కేంద్రాలలో కొనుగోళ్లు ప్రారంభించారు. ఈ కేంద్రాలలో 40 కేజీల బస్తాకు 41.600 గ్రాముల తూకంతో కాంటా వేస్తున్నారు. ఇందులో 600గ్రాములు గన్నీ బ్యాగు బరువుపోను మిగిలిన 1కేజీ తరుగు పేరిట తీస్తున్నారు. ఇలా క్వింటాలుకు గన్నీ బ్యాగు తూకం లేకుండానే 2.5 కేజీల ధాన్యాన్ని రైతులు నష్టపోతున్నారు. వంద క్వింటాళ్లు పండించిన రైతులు రెండున్నర క్వింటాళ్లు తరుగు పేరుతో కోల్పోతున్నారు. అంటే దాదాపు రూ.7వేలను నష్టపోతున్నారు. వాస్తవానికి యాసంగిలో ఎండలు మండుతుండటంతో ధాన్యంలో తేమ శాతం చాలా తక్కువగా ఉంటుంది. 17శాతం కంటే తక్కువ ఉంటే ఎలాంటి తరుగు తీయరాదు. కానీ 14 శాతం ఉంటేనే కాంటా వేస్తున్నారు. అప్పటికే రైతులు చాలా కోల్పోయారు. మళ్లీ తరుగుపేరిట దోపిడీ చేస్తున్నారు.

తరుగుపై ఫిర్యాదు చేస్తే చర్యలు

గన్నీ బ్యాగు తూకం మాత్రమే తీయాలి. తరుగు పేరిట ఎవరైన ఎక్కువ తీస్తే రైతులు ఫిర్యాదు చేయాలి. ఐకేపీ కేంద్రాలు తీస్తే డీఆర్‌డీవో, పీఏసీఎస్, మెప్మా వారు తీస్తే సంబంధిత అధికారులు చర్యలు తీసుకుంటారు. గన్నీ బ్యాగుల కొరతలేదు. ఇండెంట్ పెట్టాం. విడుతల వారిగా వస్తున్నాయి.

- విమల, డీఎం సివిల్ సప్లయ్ శాఖ గద్వాల

వేధిస్తున్న గన్నీబ్యాగుల కొరత

జిల్లాలో 23లక్షల గన్నీ బ్యాగులు అవసరం అవుతాయని అధికారులు అంచనా వేశారు. కానీ ప్రస్తుతం 3.5లక్షల గన్నీ బ్యాగులు మాత్రమే ఉన్నాయి. మరో 19లక్షల గన్నీ బ్యాగుల కోసం ఇండెంట్ పెట్టగా విడుతల వారిగా మరో 4లక్షల బ్యాగులు వచ్చాయి. కొన్ని కేంద్రాలకు గన్నీ బ్యాగులు చేరకపోవడంతో కేంద్రాలలో ధాన్యం నిల్వలు పేరుకుపోతున్నాయి.

దోచుకొని.. పంచుకుంటున్నారు..?

ఐకేపీ ద్వారా నిర్వహించే కొనుగోలు కేంద్రాలన్నీ దాదాపుగా గ్రామాలలోని నాయకుల చేతుల్లో ఉన్నాయి. పేరు మహిళా సంఘాలది నిర్వాహణ మాత్రం నాయకులే చేస్తున్నారు. ఇలా తరుగు పేరిట తీసిన ధాన్యానికి కొన్ని మిల్లులు కేంద్రం నిర్వాహకులకు కొంత డబ్బు అప్పచెపుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. మరికొందరు ఎక్కువగా తీసిన ధాన్యానికి రైతు పేరిట ఎంట్రీలు చేసి డబ్బులు డ్రాచేసి తీసుకుంటున్నారనే విషయం అందరికీ తెలిసిందే.. కానీ అధికారులు దీనిని ధ్రువీకరించడం లేదు. ప్రభుత్వం ఇచ్చే కమీషన్ చాలా తక్కువ ఉంటుంది, మహిళా సంఘాలకు అందులో 50శాతం జమ చేస్తుండటంతో నిర్వాహకులు తరుగుపేరుతో ఇలా దోపిడీ చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

రైతుల ఖాతాలలో జమకాని డబ్బులు

జిల్లాలో కొనుగోలు లక్ష్యం 1.38 లక్షల మెట్రిక్ టన్నులు కాగా ఇప్పటి వరకు దాదాపు 14,596 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. ఇందులో ఐకేపీ ద్వార 12,500, పీఏసీఎస్ ద్వార 1,500, మెప్మా ద్వార 550 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 2,143 మంది రైతుల నుంచి కొనుగోలు చేశారు. వీరికి రూ.33కోట్లు చెల్లించాల్సి ఉంది. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో ఎంట్రీలు చేయకపోవడంతో డబ్బులు రైతుల ఖాతాలలో జమకావడం లేదు. ఇప్పటి వరకు 850 మంది రైతులకు చెందిన ఎంట్రీలను నమోదు చేయగా వారికి రూ.11కోట్లు రావాల్సి ఉంది. కానీ రూ.4కోట్లు మాత్రమే రైతుల ఖాతాలలో జమ అయ్యాయి. వాస్తవానికి ఆన్‌లైన్‌లో నమోదు చేసిన రెండు రోజులలోనే ప్రభుత్వం రైతుల ఖాతాలలో జమ చేస్తున్నది. అధికారుల నిర్లక్ష్యం కారణంగా రైతుల ఖాతాలలో డబ్బులు జమకావడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి.

రూ. 5లక్షల సుపారీ వాస్తవమే!

- కొండా ప్రశాంత్‌రెడ్డి హత్య కేసులో మరో నిందితుడిని రిమాండ్
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ వెంకటేశ్వర్లు



విలేకరుల సమావేశంలో హత్యాయత్నానికి సంబంధించిన వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

భూత్పూర్, మే 3(ఆంధ్రజ్యోతి): బీజేపీ నాయకుడు, దేవరకద్ర నియోజకవర్గ ఇన్‌చార్జి కొండా ప్రశాంత్‌రెడ్డిని హత్య చేయాలని కుట్రపన్నిన నేరస్థులు ఏ-1 ముద్దాయి కాట్రావత్ రూప్‌సింగ్, ఏ-2 ముద్దాయి అరుణాచలం నవీన్‌లను ఏప్రిల్ 23వ తేదిన పట్టుకొని రిమాండ్‌కు తరలించారు. అయితే ఏ-3గా ఉన్న ముద్దాయి ఉట్టల్ కాంతప్ప, అలియాస్ శ్రీకాంత్ పరారీలో ఉన్నాడు. అయితే పోలీసులు గాలించి శనివారం జడ్చర్ల బస్టాండ్ దగ్గర ఉండగా పట్టుకున్నారు. ఈ సందర్భంగా సీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో డీఎస్పీ వెంకటేశ్వర్లు కొండా ప్రశాంత్‌రెడ్డి హత్యకు కుట్రదారుడైన ఏ-3 నిందితుడిని అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లుగా వెల్లడించారు. అయితే ఈ హత్యకు కుట్ర పన్నిన శ్రీకాంత్ వృత్తి రీత్యా హైదరాబాదులోని బోడ ఉప్పల్‌లో ఒక టీ స్టాల్ నడుపుకుంటూ జీవిస్తున్నాడు. అయితే మహబూబ్‌నగర్ చెందిన బొట్టు రవి అనే వ్యక్తి హైదరాబాదులో ఆటో నడుపుకుంటూ జీవిస్తున్నాడు. ఈ క్రమంలో ఇతను తరచూ శ్రీకాంత్ టీస్టాల్ దగ్గరకు వెళ్లి టీ తాగుతూ ఉండే వాడు. ఒక రోజు హైదరాబాద్‌లో వివాహ వేడుకల సమయంలో బొట్టు రవి ద్వారా ఏ-1 నిందితుడైన రూప్‌సింగ్ శ్రీకాంత్‌తో పరిచేయం అయ్యాడు. ఇలా మరో సమయంలో శ్రీకాంత్ శుభకార్యం చేశాడు. ఈ కార్యక్రమానికి రూప్‌సింగ్ వెళ్లాడు. తిరిగి మహబూబ్‌నగర్ వెళ్లే క్రమంలో రూప్‌సింగ్‌ను బస్‌స్టాప్ దగ్గర దించి రావడానికి శ్రీకాంత్ వెళ్లాడు. ఈ క్రమంలో రూప్‌సింగ్ కొండా ప్రశాంత్‌రెడ్డి తనకు డబ్బులు ఇవ్వాలి... ఇవ్వడం లేదని అందుకోసం హత్య చేయాలని అనుకుంటున్నానని శ్రీకాంత్‌తో చెప్పాడు. అయితే ఈ హత్య చేయడానికి మనం అరుణాచలం నవీన్ దగ్గరకు వెళదామని అనుకున్నారు. అనుకున్నట్లుగానే నారాయణపేటకు నవీన్ దగ్గరకు వెళ్లారు. ఇంతలో రాయలసీమ అనంతపూర్‌కు చెందిన పవన్ అనే మరో వ్యక్తిని వీరు కలిశారు. అందరు కలిసి అరుణాచలం నవీన్ దగ్గరకు కొండా ప్రశాంత్‌రెడ్డిని హత్య చేయడానికి రూ.5లక్షల సుపారీ మాట్లాడుకున్నారు. ఈ విషయం ఫోన్ రికార్డింగ్ ద్వారా కొండా ప్రశాంత్‌రెడ్డి తెలుసుకొని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అయితే ఈ హత్య కుట్రకు సంబంధించి లోతుగా దర్యాప్తు చేపట్టడంతో ఒక్కొక్కరు బయటికి వస్తున్నారని డీఎస్పీ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. అయితే ఏ-6గా పవన్‌ను గుర్తించినట్లు, అతను పరారీలో ఉన్నాడన్నారు. అదే విధంగా మరో ఇద్దరు అనుమానితులు ఏ-4, ఏ-5 వీరు కూడా పరారీలో ఉన్నారని వారిని కూడా త్వరలో పట్టుకుంటామని డీఎస్పీ చెప్పారు. కొండా ప్రశాంత్‌రెడ్డి హత్య కుట్ర వెనుక ఎలాంటి రాజకీయ నాయకుల ప్రమేయం లేదని, ఇది కేవలం వ్యక్తిగత కుట్రలతో మాత్రమే హత్యకు కుట్ర పన్నినారని డీఎస్పీ వెల్లడించారు. ఈ విలేకరుల సమావేశంలో సీఐ రామకృష్ణ, దేవరకద్ర ఎస్ఐ నాగన్న, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యం కొనాలని బీఆర్ఎస్ నాయకుల రాస్తారోకో


వ్యవసాయ మార్కెట్ యార్డు ముందు రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు, రైతులు

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, మే 3 (ఆంధ్రజ్యోతి) : వర్షంతో తడిసిన ధాన్యం కొనాలని వనపర్తి జిల్లా చిట్యాల వ్యవసాయ మార్కెట్ యార్డు ముందు శనివారం బీఆర్ఎస్ నాయకులు రైతులతో కలిసి రాస్తారోకో నిర్వహించారు. అకాల వర్షాల వల్ల మార్కెట్ యార్డులో ధాన్యం తడిసిందని ఆ మొత్తాన్ని ప్రభుత్వమే కొనాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్ మాటాడుతూ మార్కెట్ యార్డుకు నెల రోజుల క్రితం వచ్చిన ధాన్యాన్ని గన్నీ బ్యాగులులేవని, ట్రాన్స్‌పోర్టు లేదని కొనుగోలు చేయకపోవడం వల్లే 30 వేల బస్తాలు నీటిపాలు అయ్యాయని ఆరోపించారు. ఇది ప్రభుత్వ నిర్లక్ష్యానికి పరాకాష్ట అని దుయ్యబట్టారు. ఈ యాసంగిలో 75 లక్షల బస్తాలు మార్కెట్ యార్డుకు వసాయని అంచనా ఉన్నా పర్యవేక్షణ లేక రైతులను ఈ ప్రభుత్వం నట్టేట ముంచిందని విమర్శించారు. అంతకుముందు వారు మార్కెట్ యార్డులో తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. అనంతరం రోడ్డుపైకి వచ్చి రాస్తారోకో నిర్వహించారు. తహసీల్దార్ రమేష్ రెడ్డి అక్కడికి వచ్చి తడిసిన ధాన్యాన్ని మద్దతు ధరతో కొనుగోలు చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో నాయకులు వాకిటి శ్రీధర్, పలుస రమేష్ గౌడ్, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ విజయ్‌కుమార్, పీఏసీఎస్ అధ్యక్షులు వెంకట్రావ్, రఘువర్ధన్ రెడ్డి, నాయకులు నందిమల్ల అశోక్, గంధం పరంజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఫైనాన్స్ వేధింపులతో ట్రాక్టర్‌ను తగులబెట్టిన యజమాని


ఫైనాన్స్ అధికారులు వేధిస్తున్నారని యాజమాని దహనం చేసిన ట్రాక్టర్

తిమ్మాజిపేట, మే 3 (ఆంధ్రజ్యోతి) : ఫైనాన్స్ అధికారుల వేధింపులలో యాజమాని తన ట్రాక్టర్‌ను పెట్రోల్‌పోసి తగులబెట్టిన ఘటన శనివారం నాగర్‌కర్నూలు జిల్లా తిమ్మాజిపేట మండల పరిధిలోని చేగుంటలో చోటుచేసుకున్నది. ఈ ఘటనకు సంబంధించి బాధితుడు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. 2023లో జాన్‌డీర్ కంపెనీ ట్రాక్టర్‌ను ఎల్‌అండ్‌టీ ఫైనాన్స్ ద్వారా తీసుకున్నానని, ప్రతీ కిస్తుకు రూ. 98 వేలు చెల్లించేలా పది కిస్తులకు ఒప్పందం చేసుకొని రెండు కిస్తులు చెల్లించానన్నారు. మూడవ కిస్తుకు సంబంధించి రూ. 80 వేలు చెల్లించినా రశీదు తనకు ఇవ్వలేదని, మిగతా రూ. 18,000 ధాన్యం అమ్మి చెల్లిస్తానని చెప్పినా శనివారం గ్రామానికి వచ్చిన ఫైనాన్స్ అధికారి హరివర్ధన్‌రెడ్డి దూషించడంతో మనస్తాపానికి గురై వెంటనే ట్రాక్టర్‌పై పెట్రోల్‌పోసి తగులబెట్టినట్లు ఆవేదన వ్యక్తంచేశారు. ఇదిలా ఉండగా ఫైనాన్స్ అధికారి చంద్రశేఖర్‌ను వివరణ కోరగా కిస్తు చెల్లించాల్సిన గడువు దాటి ఐదునెలలు గడుస్తున్నదని, ఫోన్ ద్వారానే కిస్తుల విషయం అడిగామని, ఏ రోజు కూడా అతన్ని వేధించలేదని చెప్పారు.

స్కేటింగ్ యాత్రికుడు రోషన్‌కు ఘన స్వాగతం


రోషన్‌కు స్వాగతం పలుకుతున్న హిందూ సంఘాల నాయకులు

నాగర్‌కర్నూల్ టౌన్/తెలకపల్లి, మే 3 (ఆంధ్రజ్యోతి): బీహార్ చెందిన స్కేటింగ్ (చక్రాల బూట్లు) రోషన్‌ను జిల్లా కేంద్రంలో హిందూ సంఘాల ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. స్కేటింగ్ ద్వారా దేశంలోని జ్యోతిర్లింగాలను దర్శిస్తూ శ్రీశైలం నుంచి బయలు దేరిన రోషన్ 84వ రోజు శనివారం సాయంత్రం నాగర్‌కర్నూల్ జిలా కేంద్రానికి చేరుకున్నాడు. హిందూ సంఘాల నాయకులు ఆయనకు బస్టాండు కూడలిలో స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా స్కేటింగ్ యాత్రికుడు రోషన్ మాట్లాడుతూ దేశంలోని దేశంలోని జ్యోతిర్లింగాలను దర్శిస్తూ నేపాల్‌లోని పశుపతినాథ్ దర్శనంతో పాటు చార్‌దాం యాత్రతో తన హిందూ పుణ్యక్షేత్రాల యాత్ర ముగుస్తుందని పేర్కొన్నారు. అనంతరం స్థానిక అయ్యప్పస్వామి దేవాలయంలో రాత్రికి బస చేశాడు. హిందూ సంఘాల నాయకులు పిడికిళ్ల జంగయ్య, పస్పుల లక్ష్మయ్య, శివరావు, అశోక్, సుందర్, అనిల్, సునీల్, వెంకటేష్, వెంకట్ తది తరులు పాల్గొన్నారు.

- స్కేటింగ్ చేస్తూ మార్గమధ్యలో జ్యోతిర్లింగ దర్శనంలో భాగంగా రోషన్ శ్రీశైలం వెళ్తూ 84వ రోజు నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లికి చేరుకున్నారు. ఆయన యాత్ర దిగ్విజయం కావాలని వారి ఆరోగ్యంతో తీర్థ యాత్రలు క్షేమంగా జరగాలని కోరుతూ తెలకపల్లి హిందూ బంధువులు కలిసి రోషన్‌కు శాలువా, పూలమాల వేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆర్ఎస్ఎస్ జిల్లా కార్యవాహ చంద్రశేఖర్, విశ్వహిందూ పరిషత్ జిల్లా సహకార్యదర్శి మారోజు ఉమాపతి, విశ్వహిందూ పరిషత్ తెలకపల్లి టౌన్ అధ్యక్షుడు రామకృష్ణ, శివకృష్ణ, రవికుమార్, భక్తతుకారాం, బి.రమేష్, ఇరువెంటి సాయిబాబు పాల్గొన్నారు.


భూత్పూర్ దగ్గర వర్షానికి కొట్టుకుపోయిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న బీఆర్ఎస్ పార్టీ నాయకులు


పెబ్బేరు మార్కెట్ యార్డులో తడిసిన ధాన్యం కుప్పలు


ధాన్యం కుప్పలపై కవర్లు కప్పిన రైతులు

పంట వర్షార్పణం

అకాల వర్షానికి అన్నదాత పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. అనుకోకుండా ఈదురుగాలులతో కూడిన వర్షానికి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో పంట నష్టంతో పాటు కొన్ని చోట్ల చెట్లు విరిగిపడి, విద్యుత్ స్తంభాలు పడిపోవడంతో కరెంట్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ధాన్యం వర్షంలో తడవటంతో తీవ్ర నష్టం సంభవించింది. దిక్కుతోచని స్థితిలో అన్నదాత ఆందోళన చెందుతున్నాడు. భూత్పూర్, పెబ్బేరు, మరికల్, ఉండవల్లి తదితర ప్రాంతాల్లో అకాలం దెబ్బకు అన్నదాత అతలాకుతలమయ్యాడు. వివరాలిలా ఉన్నాయి.

- పలుచోట్ల ధాన్యం తడిసి భారీ నష్టం
- దిగులు చెందుతున్న రైతన్నలు

భూత్పూర్/ పెబ్బేరు రూరల్ /మరికల్/ ఉండవల్లి /అచ్చంపేట, మే 3(ఆంధ్రజ్యోతి): పొద్దస్తమానం ఎండలు భగ-భగ మండి... సాయంత్రం కాగానే ఉన్నట్లు ఉండి ఎక్కడ లేని విధంగా భారీ వర్షం దంచి కొట్టడంతో రైతులకు పెద్ద కష్టం ఏర్పడింది. అంతే కాకుండా చాలా పంట నష్టం జరిగింది. శుక్రవారం సాయంత్రం అకాల వర్షానికి పొలాల్లో ఉన్న పంట కోసి కల్లాల్లో అమ్మకానికి సిద్ధం చేసి ఉంచిన వరి కుప్పలు మొత్తం తడిసి పోయి పాడైపోయాయి.

మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలంలోని 12 కేంద్రాల్లో వరి ధాన్యం అమ్మకాలు కొనసాగుతున్నాయి. అయితే తేమ శాతం ఎక్కువ ఉందని, ధాన్యంలో చెత్త, చెదారం అధికంగా ఉన్నాయని శుభ్రం చేయాలని, గన్ని బ్యాగులు రాలేదని ఇలా రైతులను అధికారులు, మహిళా సంఘాల వారు ఆలస్యం చేయడంతో ధాన్యం చాలా పాడైపోయింది. ఇది ఇలా ఉంటే ఇంకా కోత కోయని వరి పంట మండలంలోని అన్నీ గ్రామాల్లో చూస్తే దాదాపుగా 25నుంచి 35శాతం వరకు కోత దశలో ఉంది. అయితే గత వారం, పది రోజుల క్రితం వర్షం ప్రతీ రోజు ఉరుములు, మెరుపుల రూపంలో రైతులను భయపెట్టిస్తుంది. మండలంలోని హస్నాపూర్, తాటికొండ, రావులపల్లి, శేరిపల్లి(హెచ్) భూత్పూర్ తదితర గ్రామాల్లో ఇంకా చాలా చోట్ల వరి పంట కోత దశలోనే ఉంది. శుక్రవారం కురిసిన అకాల వాన, వడగళ్లకు దాదాపుగా 40శాతం పైగా వరి పంట దెబ్బతిన్నది. అదే విధంగా అమ్మడానికి తీసుకొచ్చిన ధాన్యం కుప్పలు దాదాపుగా చాలా చోట్ల వాన నీటిలో తడిసి ముద్దై పోయింది. భూత్పూర్ కేంద్రంలో వానకు భారీ మొత్తంలో వరి కుప్పలు వాన నీటిలో కొట్టుకుపోయి. రావులపల్లి, పోతులమడుగు వరి కొనుగోలు కేంద్రాల్లో వరి కుప్పలు నీట మునిగి పోయి ధాన్యం పాడైపోయిందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గాలివాన బీభత్సం

పెబ్బేరు మండలంలో పలు గ్రామాల్లో శుక్రవారం రాత్రి గాలివాన బీభత్సం సృష్టించింది. దాదాపుగా మూడు గంటలుగా భారీగా ఈదురు గాలులు ఉరుములు మెరుపులతో వర్షం కురిసింది. విద్యుత్తు స్తంభాలు విరిగిపోయాయి. రహదారులపై చెట్లు విరిగిపడ్డాయి. కోత కోసిన వరి పంట కల్లాల్లో ఉండటంతో కాపాడుకునేందుకు రైతులు ఉరుకులు పరుగులు పెట్టారు. మామిడి కాయలు నేలరాలిపోయాయి. చేతికి వచ్చిన పంటలు వర్షం ధాటికి నోటికందకుండా పోయిందని అన్నదాతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నష్టపోయిన రైతులను ప్రభుత్వం అదుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

వడగళ్లతో..

మరికల్ మండల కేంద్రంతో పాటు తీలేరు, కన్ననూర్ గ్రామాల్లో ఈదురుగాల్పులు, వడగళ్ల వాన బీభత్సం సృష్టించింది. ధాన్యం చేనులోనే రాలి మొలకెత్తాయి. ఆరబోసిన వరి కుప్పలు పూర్తి స్థాయిలో వర్షానికి తడిసిపోయాయి. తీలేరు గ్రామ రైతులు పడిడాల రాములు, పగిడాల అండలమ్మ పగిడాల శ్రీను వరి చేను ఆలస్యంగా వరినాట్లు వేయడంతో కోయడానికి ఇంకా ఎనిమిది రోజులు పడుతుంది. అంతలోనే అకాల వడగళ్ల వాన రావడంతో ధాన్యం రాలిపోయి మొలకెత్తాయి. కన్ననూర్ గ్రామంలో ధాన్యం కల్లాలు లేక రైతులు సొంత పొలంలో ఆరబోశారు. అకాల వర్షం రావడంతో ధాన్యం రాశుల చుట్టూ వరద చేరింది. రైతు, 10 మంది మహిళ కూలీలతో ధాన్యం ఆరబోశారు. రహదారులు, మురికి కాలువలు లోతట్టు ప్రాతాల్లో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేక వర్షం నీరు నిలిచి పోయింది.

ట్రాక్టర్‌పై విరిగిపడిన చెట్టు

ఉండవల్లి మండల పరిధిలోని మారమునగాల-2 గ్రామంలో శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి తోడు ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. దీంతో గ్రామంలోని ఐదవ వార్డులో చంద్రన్న ఇంటి పక్కన ఉన్న పెద్ద చెట్టు పక్కనే ఉన్న ట్రాక్టర్‌పై పడింది. అదే సమయంలో చెట్టు పక్కనే ఉన్న విద్యుత్ స్తంభం కూడా విరిగి పడటంతో ఆ ప్రాంతంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. చెట్టు కింద ట్రాక్టర్ నుజ్జునుజ్జు అయినట్లు స్థానికులు తెలిపారు. అదృష్టవశాత్తు ఎటువంటి ప్రాణనష్టం జరగలేదని చెప్పారు. కాగా, విద్యుత్ సరఫరా నిలిచిపోడంతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో పాటు గ్రామంలో నీటి సరఫరా కూడా నిలిపోయిందని తెలిపారు. ఈ విషయాన్ని గ్రామస్థులు విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించారు. త్వరగా విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

వాహనదారులకు ప్రమాదమే

వనపర్తి రూరల్, మే 3(ఆంధ్రజ్యోతి) :అనుకోకుండా ఈదురు గాలులు వీస్తే ప్రయాణికులకు వాహనదారులకు ఇబ్బందులకు గురి కాక తప్పడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం రాత్రి వర్షంతో పాటు ఈదురు గాలులు రావడంతో వనపర్తి నుంచి పెద్దగూడెం వెళ్లే రహదారిలో రోడ్డు పక్కల ఉన్న పెద్ద చెట్టు విరిగి రోడ్డుకు అడ్డంగా పడిపోవడంతో వాహనదారులు చాలా ఇబ్బందులకు గురయ్యారు. రాత్రివేళలో ప్రయాణం చేసే వారు జాగ్రత్తగా ఉండాలని పలువురు కోరారు.

పిడుగుపాటుకు కాడెద్దులు మృత్యువాత


అంకిరోనిపల్లి గ్రామంలో వ్యవసాయ పొలంలో మృతి చెందిన ఎద్దు

అచ్చంపేటలో అకాల వర్షం పిడుగులతో కాడెద్దులు మృతి చెందిన సంఘటన శుక్రవారం రాత్రి అచ్చంపేట మండల పరిధిలోని కొర్రతండా లో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన శంకర్‌కు చెందిన రెండు ఎద్దులను వ్యవసాయ పొలంలో శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి పిడుగుపడటంతో మృతి చెందినట్లు తెలిపారు. ఎద్దులు మృతితో రూ.లక్ష నష్టం వాటిల్లిందన్నారు. అదేవిదంగా మండల పరిధిలోని అంకిరోనిపల్లి గ్రామానికి చెందిన లక్ష్మయ్య ఎద్దు పిడుగుపాటుతో మృతి చెందినట్లు ఆయన తెలిపారు. వ్యవసాయ పొలంలో శుక్రవారం ఉంచి వచ్చారు. అకాలవర్షం పిడుగుపాటుకు రాత్రి ఎద్దు మృతి చెందింది. ఉదయం రైతు పొలం వెళ్లి చూడగా ఎద్దు మృతి చెందడంతో కన్నీరు పెట్టుకు న్నారు. రూ.60వేలు నష్టం వాటిల్లిందని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. వారిని ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

క్రైం కార్నర్

వెల్కిచర్లలో మహిళ దారుణ హత్య

▸▸ సంఘటనా స్థలాన్ని పరిశీలించిన సీఐ రామకృష్ణ



కొత్తగొల్ల నాగమ్మ (ఫైల్)

భూత్పూర్, మే 3 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో పడుకొని ఉన్న మహిళను కత్తితో గుర్తు తెలియని వ్యక్తులు మెడ, ఛాతిపై దారుణంగా పొడిచి హత్య చేశారు. ఈ సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా, భూత్పూర్ మండలంలో చోటు చేసుకుంది. సీఐ రామకృష్ణ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని వెల్కిచర్ల గ్రామానికి చెందిన కొత్తగొల్ల నాగమ్మ(40) అనే మహిళను గత 20ఏళ్ల కిందట జడ్చర్ల మండలంలోని పెద్దపల్లి గ్రామానికి చెందిన చెన్నయ్యకు ఇచ్చి వివాహం చేశారు. ఏడాది పాటు సవ్యంగా సాగిన వీరి సంసార జీవితం తరువాత మనస్పర్ధలు రావడంతో కొత్తగొల్ల నాగమ్మ తన సంవత్సరం వయస్సు ఉన్న కూతురును తీసుకొని తన తల్లిగారి గ్రామం అయిన వెల్కిచర్లకు వచ్చింది.

భర్త, కూతరు ఇద్దరు అనారోగ్యంతో చనిపోయారు. నాగమ్మ వంటరిగానే గ్రామంలో కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తుంది. అదే గ్రామంలో సొంత ఇంటిని కూడా నిర్మించుకుంది. రోజువారి మాదిరిగానే కొత్తగొల్ల నాగమ్మ కూలీ పనులు చేసుకొని శుక్రవారం సాయంత్రం ఇంటి వద్ద ఉన్నది. రాత్రి ఏమి జరిగిందో తెలియదు. ఇంట్లో హత్యకు గురై రక్తపు మడుగులో పడిఉంది. విషయాన్ని తోటి కూలీలు శనివారం ఉదయం కూలీ పనులకు నాగమ్మ ఇంటికి వెళ్లి చూడగా కత్తులతో శరీరంపై పొడిచి గుర్తు తెలియన వ్యక్తులు చంపివేసి వెళ్లిపోయారు. విషయాన్ని తెలుసుకున్న భూత్పూర్ సీఐ రామకృష్ణ హత్య జరిగిన సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు మారణాయుధాలతో పొడిచి హత్య చేశారని సీఐ గుర్తించారు. మృతదేహాన్ని పంచనామా నిర్వహించి పోస్టుమార్టు నిమిత్తం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. హంతకురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లుగా సీఐ రామకృష్ణ తెలిపారు.

ఈతకు వెళ్లిన బాలుడి మృతి

తిమ్మాజిపేట, మే 3 (ఆంధ్రజ్యోతి) : తిమ్మాజిపేట మండల పరిధిలోని ఆవంచ చెరువులోకి ఈతకు వెళ్లిన శశాంత్(10) ప్రమాదవశాత్తు మృతి చెందాడు. ఏఎస్ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం... ఎదిరేపల్లి గ్రామానికి చెందిన రమేష్‌కు ఇద్దరు కుమారులు. శశాంత్ పెద్ద కుమారుడు. తండ్రి మూడేళ్ల క్రితమే చనిపోవడంతో పెద్దనాన్నతో ఉంటున్నాడు. జడ్చర్లలోని ఎస్టీ వసతి గృహంలో ఉంటూ చదువుతుండగా మార్చిలో అమ్మమ్మ, తాతయ్య ఆవంచకు తీసుకెళ్లారు. వేసవిలో ఈత నేర్చుకోవడం కోసం చెరువుకు వెళ్లాడు. గత మూడు రోజులుగా అతని ఆచూకీ కోసం ఎంత వెతికినా ఫలితం లేకుండాపోయింది. గ్రామ సమీపంలోని చెరువులో నీటిపై తేలాడుతున్న బాలుడిని మరో వ్యక్తి చూసి కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చాడు. బాలుడి మృతిపై అనుమానాలు ఉన్నాయని పెద్దనాన్న మల్లేష్ శనివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు తెలిపారు.

పది క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత



పీడీఎస్ బియ్యం పట్టివేసిన పోలీసులు

నర్వ, మే 3 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా నర్వ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎరుకలి వెంకటేష్ తండ్రి హనుమంత్, రాజు తండ్రి వెంకటయ్య అనే వ్యక్తులు శుక్రవారం అర్ధరాత్రి అక్రమంగా టాటాఏసీలో 10 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం తీసుకువెళ్తున్న సమయంలో కల్వాల్ గ్రామ శివారులో టాస్క్‌ఫోర్స్, నర్వ పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. బియ్యం పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించి డీటీ పంచనామా అనంతరం ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ కుర్మయ్య తెలిపారు. నర్వ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎవరైనా అక్రమంగా పీడీఎస్ రైస్‌ను నిల్వ ఉంచిన రవాణా చేసినా.. ఎవరికైనా అమ్మినా చట్ట ప్రకారం చర్యలు తీసుకోనున్నట్లు ఎస్ఐ హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో యువకునికి తీవ్ర గాయాలు

కోస్గి రూరల్, మే 2 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ యువకునికి తీవ్ర గాయాలైన ఘటన నారాయణపేట జిల్లా కోస్గి మండల కేంద్రంలో శుక్రవారం రాత్రి సమయంలో చోటుచేసుకొంది. ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గుండుమాల్ మండలం ముదిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన మోది రవి తన ద్విచక్రవాహనంపై రాత్రి దాదాపు 10 గంటల సమయంలో తన సొంత గ్రామం నుంచి కోస్గికి బయలు దేరాడు. కోస్గి ఏటీకే ఫంక్షన్ హాల్ సమీపంలో కోస్గి నుంచి వేగంగా వచ్చిన కారును తప్పించే క్రమంలో కారు బైకు రెండూ ఒకదానికొకటి ఢీ కొన్నాయి. దీంతో బైక్‌పై ఉన్న రవి ప్రమాదవశాత్తు రోడ్డుపై పడటంతో అతని తలకు, ముఖానికి తీవ్ర గాయాలయ్యాయి. బాధితున్ని వెంటనే కోస్గి ఆసుపత్రికి తరలించి అక్కడి నుంచి మహబూబ్ నగర్ ఆసుపత్రికి తరలించినట్లు బంధువులు తెలిపారు. కాగా ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని స్థానిక ఎస్ఐ బాలరాజు తెలిపారు.

ఊట్కూర్‌లో బాలుడికి డెంగీ నిర్ధారణ

▸▸ అప్రమత్తమైన వైద్య సిబ్బంది

▸▸ పరిసరాల్లో దోమల నివారణ మందు పిచికారి

▸▸ చుట్టుపక్కల 50 ఇళ్లలో డెంగీ సర్వే



ఊట్కూర్ గాంధీనగర్ వీధిలోని డెంగీ నిర్ధారణ అయిన ఇంట్లో మందు పిచికారి చేస్తున్న వైద్య సిబ్బంది

ఊట్కూర్, మే 3 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండల కేంద్రంలోని గాంధీనగర్ విధికి చెందిన ఒక బాలుడికి శనివారం డెంగీ వ్యాధి నిర్ధారణ అయ్యింది. విషయం తెలుసుకున్న ఊట్కూర్ సీహెచ్‌సీ సిబ్బంది గాంధీనగర్ వీధిలోని బాలుడి ఇంటి వద్దకు వెళ్లి కుటుంబంలో ఇంకా ఎవరికైనా జ్వరం ఉందా అని తెలుపుకున్నారు. అనంతరం జిల్లా అధికారులకు సమాచారం ఇవ్వడంతో జిల్లా నుంచి రాపిడ్ రెస్పాన్స్ టీం సభ్యుడు శంకర్, పర్యవేక్షకుడు చంద్రశేఖర్‌తో పాటు ఎంపీహెచ్ఏవో విజయ్‌కుమార్, పర్యవేక్షకుడు నర్సిములు బాలుడి ఇంటికి వెళ్లి పరిసరాలను పరిశీలించి కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించారు. అనంతరం మట్టి కుండల్లో ఉన్న నీటిని పారవేయడంతో పాటు చుట్టుపక్కలపైరెత్రం స్ప్రే చేయించారు. దోమల నివారణ కోసం వీధిలో మందు చల్లడంతో పాటు బ్లీచింగ్ పౌడర్ వేయించారు. అనంతరం వీధిలోని చుట్టు పక్కల గల 50 ఇళ్లల్లో జ్వర లక్షణాలు ఉన్నవారి రక్తాన్ని సేకరించి డెంగీ నిర్ధారణ పరీక్షలు చేశారు. అనంతరం వీధిలోని ప్రజలకు అవగాన కల్పిస్తూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దోమలు కుట్టడం వల్లనే మలేరియా, డెంగీ వంటి జ్వరాలు వస్తాయని అన్నారు. అలాగే ప్రతీ శుక్రవారం డ్రైడే - ఫ్రై డే నిర్వహించడం వల్లదోమల ఉత్పత్తిని అరికట్ట వచ్చని అన్నారు. డాక్టర్ సంతోషి, ఎంపీహెచ్‌వో విజయ్‌కుమార్, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు ఎడమ కాలువ



గుంటిపల్లి శివారు వద్ద పూర్తిగా ధ్వంసమైన డీ 6 కాలువ

పంట కాలువలకు మరమ్మతులేవి ?

▸▸ అధ్వానంగా మారిన ఎడమ కాలువ లైనింగ్

▸▸ డీ6 ధ్వంసం అయిందంటున్న రైతులు

▸▸ ప్రణాళికలు సిద్ధం చేస్తామంటున్న ఇరిగేషన్ అధికారులు

ఆత్మకూరు, మే 3 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఏడాది ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు ఎడమ కాలువ ద్వారా ఆయకట్టుకు నీటిని అందించే ప్రధాన కాలువ లైనింగ్ దెబ్బతిని అక్కడక్కడ రంధ్రాలు ఏర్పడి నీరు వృథాగా పోతోందని ఆయకట్టు రైతులు అంటున్నారు. ఈ వరాకాలం రాకమునుపే ఎడమ కాలువ లైనింగ్ మరమ్మతులు చేపడితే సౌకర్యంగా ఉంటుందని ఆయకట్టు రైతులు కోరుతున్నారు. ప్రాజెక్టు నుంచి మొదలుకొని ఆత్మకూరు వరకు ఆరు కిలో మీటర్ల మేర 8 రంధ్రాలు ఏర్పడ్డాయి అంటే రామన్‌పాడు రిజర్వాయర్ వరకు 17 కిలో మీటర్ల మేర ఎన్ని రంధ్రాలు ఏర్పడ్డాయో అర్థం చేసుకోవచ్చు. 2004లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ వైఎస్సార్ హయాంలో ఎడమ కాలువ దానికి అనుసంధానంగా ఉన్న పిల్ల కాలువలకు మరమ్మతులు చేయించారు. సుమారుగా 20 సంవత్సరాలు పూర్తి అవుతున్నా ఇప్పటి వరకు మరమ్మతులు చేయకపోవడంతో వరద ఉధృతికి కాలువలు రంధ్రాలు ఏర్పడి పంటలకు నీరందక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనికి తోడు ప్రధాన ఎడమ కాలువకు ఇరువైపులా రోడ్డు ఉండటంతో రోడ్డుపై ఉన్న మట్టి రాళ్లు కాలువలో పడి నీటి జమ్ము, గడ్డి ఏపుగా పెరిగి నీటిని అడ్డుకునే పరిస్థితి ఏర్పడింది. ప్రధాన ఎడమ కాలువలో పూడికతీత చేపడితే దిగవకు నీరు మరింత స్పీడ్‌గా వెళ్లి చివరి ఆయకట్టు వరకు రైతులకు సాగుకు అందే అవకాశం ఉంటుందని రైతులు అంటున్నారు.

మరీ అధ్వానంగా డీ6 కాలువ

ఎడమ కాలువకు అనుసంధానంగా జూరాల గ్రామ శివారు వద్ద డీ6 కాలువ గేట్లను అమర్చి ఆ కాలువ ద్వారా జూరాల, గుంటిపల్లి, ఆరేపల్లి, తూంపల్లి , మోట్లంపల్లి, కత్తెపల్లి , రేచింతల, వీర రాఘవపూర్ గ్రామాలకు కలుపుకుని 14 కిలో మీటర్ల మేర పదివేల ఎకరాలకు పైగా సాగు చేస్తున్నారు. ఆయకట్టు విస్తీర్ణానికి సరిపడా డీ6 కాలువ నీరు సరిపడకపోవడంతో రంధ్రాలు ఏర్పడి మరింత ధ్వంసం అయిందని చివరి ఆయకట్టు రైతులు అంటున్నారు. ప్రాజెక్టు అధికారులు, లష్కర్లు ఎప్పటికప్పుడు పంట కాలువలను పరిశీలించి సాగుకు సరిపడా నీటిని అందించేందుకు గేట్లను ఏర్పాటు చేయకపోవడంతోనే ఈ దుస్థితి నెలకొందని ఆయా గ్రామాల రైతులు అంటున్నారు. మే మొదటి వారం నుంచి జూలై చివరి వారం వరకు ఖరీఫ్ సీజన్‌కు రెండు నెలల పాటు సమయం ఉంటుంది. ఆ సమయంలోనే ప్రాజెక్టు అధికారులు మరమ్మతులు చేయాల్సిన పనులను గుర్తించి తక్షణమే మరమ్మతులు చేపడితే అనుకూలంగా ఉంటుందని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు. గత రెండు సంవత్సరాల క్రితం డీ6 కాలువ మరమ్మతుల నిమిత్తం 50 లక్షల రూపాయలు కేటాయించి మరమ్మతులు చేపడతామని అధికారులు ఆదేశాలు జారీ చేసినా సంబంధిత గుత్తేదారు అందుబాటులోకి రాకపోవడంతో మరమ్మతు పనులు అలాగే నిలిచిపోయాయి.

జూలై మూడో వారం నాటికి పనులు పూర్తయ్యేవి

ఇదిలా ఉంటే, ఇది వరకే టెండర్లు పిలిచి సంబంధిత గుత్తేదారులకు పనులను పురమాయిస్తే మే మొదటి వారంలో పనులు ప్రారంభించి జూలై మూడో వారం నాటికి పనులు పూర్తయ్యేవి .అని పలువురు రైతులు పేర్కొంటున్నారు. ఇప్పుడు ప్రణాళికలు పంపితే టెండర్లు పిలిచే వరకు మరింత ఆలస్యమై ఈ ఏడాది కూడా మరమ్మతులు చేపట్టే అవకాశం పోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తొందరలోనే టెండర్లు పిలిచి మరమ్మతులు చేపడితే జూలై మూడో వారంలో సాగునీటిని విడుదల చేస్తే ఖరీఫ్ సీజన్ ముందుగానే ముగించుకునే అవకాశం ఉందని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.

మరమ్మతు పనులను గుర్తిస్తున్నాం

ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు నుంచి మొదలుకొని ఎడమ కాలువ ఆయకట్టు 1.20 ఎకరాలకు విస్తరించింది. అమరచింత మొదలుకొని కొల్లాపూర్ వరకు 100 కిలో మీటర్ల మేర ఎడమ కాలువ ఆయకట్టు పరిధి ఉందని ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జగన్మోహన్ తెలిపారు. ఆయా సబ్ డివిజన్లు, డీఈ, ఏఈ, వర్క్ ఇన్‌స్పెక్టర్‌ల ద్వారా మరమ్మతులను గుర్తించేందుకు గత వారం రోజుల నుంచి కాలువలను పరిశీలిస్తున్నామని తెలిపారు. మరో నాలుగు రోజుల్లో పూర్తి సమాచారం సేకరించి ఇరిగేషన్ ఉన్నతాధికారులకు ప్రణాళికలు పంపనున్నట్లు వివరించారు. వారి ఆదేశాల మేరకు టెండర్లు పిలిచి మరమ్మతులు చేపట్టనున్నామని జగన్మోహన్ తెలిపారు.

ఇదే అనుకూల సమయం



పంట కాలువలు మరమ్మతులు చేపట్టడానికి ఇదే అనుకూల సమయం. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడానికి మరో రెండు నెలల పాటు సమయం ఉండటంతో అధికారులు యుద్ధ ప్రాతిపదికన పంట కాలువల మరమ్మతులు చేపట్టాలి. గత ఖరీఫ్ సీజన్‌లో జూరాల శివారు వద్ద డీ6 కాలువ గండి ఏర్పడి వృదాగా నీరు కృష్ణానదిలో కలిసిపోతే నాలుగు రోజుల పాటు ప్రధాన ఎడమ కాలువ నీటిని నిలిపివేసి మరమ్మతులు చేపట్టే దుస్థితి ఏర్పడింది. కావునా అధి కారులు మరమ్మతులను గుర్తించి తక్షణమే చేపట్టాలి.

- ఎల్లన్న, గుంటుపల్లి గ్రామ డీ6 కాలువ ఆయకట్టు

పోలేపల్లి గ్రామ పంచాయతీలో త్రిసభ్య కమిటీ విచారణ

▸▸ రెండవ పర్యాయం నిర్వహించిన విచారణలో పాల్గొన్న మాజీ సర్పంచ్

▸▸ వచ్చిన అభియోగాలపై ఈ నెల 12లోగా పూర్తి ఆధారాలతో సంజాయిషీ ఇవ్వాలని అవకాశం



జడ్చర్ల మండలం పోలేపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో చేతనరెడ్డి, అప్పటి గ్రామపంచాయతీ కార్యదర్శి శివప్రసాద్‌లతో విచారణ చేపట్టిన త్రిసభ్య కమిటీ సభ్యులు

జడ్చర్ల, మే 3 (ఆంధ్రజ్యోతి) : పోలేపల్లి గ్రామపంచాయతీలో జరిగిన అవినీతి, అక్రమాలపై కలెక్టర్ ఏర్పాటు చేసిన త్రిసభ్య కమిటీ శనివారం మరో పర్యాయం విచారణ చేపట్టింది. డీఆర్డీఏ నర్సింహులు, పీఆర్ ఈఈ నరేందర్‌రెడ్డి, జడ్చర్ల ఎంపీడీవో విజయ్‌కుమార్‌ల త్రిసభ్య కమిటీ సభ్యులు పోలేపల్లి గ్రామ పంచాయతీలో 2019-20 నుంచి 2023-24వ ఆర్థిక సంవత్సరం వరకు జరిగిన అవినీతి, అక్రమాలపై మాజీ సర్పంచ్ చేతనరెడ్డి, బదిలీపై వెళ్లిన గ్రామపంచాయతీ కార్యదర్శి శివప్రసాద్‌లతో విచారణ నిర్వహించారు. ఐదు సంవత్సరాలలో రూ. కోటి 73లక్షలు అవినీతి, అక్రమాలు జరిగాయంటూ గత సంవత్సరం సెప్టెంబరులో అప్పటి డీఎల్‌పీవో పండరీనాథ్ విచారణ చేపట్టి, పూర్తి నివేదికను కలెక్టర్‌కు అప్పగించారు. ఆ అంశంపై తాజాగా పూర్తి విచారణ చేపట్టి నివేదికను అందచేయాలంటూ త్రిసభ్య కమిటీని కలెక్టర్ ఏర్పాటు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పోలేపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో గత నెల 16న చేపట్టిన విచారణలో మాజీ సర్పంచ్ హాజరు కాకపోవడంతో తాజాగా మరొక పర్యాయం విచారణ చేపట్టారు. ఈ విచారణలో మాజీ సర్పంచ్ చేతనరెడ్డితో పాటు ఆమె భర్త రాంచంద్రారెడ్డి సైతం హాజరయ్యారు. ఎక్స్‌కవేటర్‌లతో పనులు నిర్వహించినట్లుగా ఎంబీ రికార్డు లేకుండానే డబ్బులను డ్రా చేసినట్లు, అలాగే సీసీ కెమెరాలకు సైతం లక్షల రూపాయలు వెచ్చించినట్లు మాజీ సర్పంచ్, గ్రామ పంచాయతీ కార్యదర్శిలపై అభియోగాలు వచ్చాయి. రూ.5వేలకు పైగా చేపట్టిన పనులకు ఎంబీ రికార్డు చేసి, చేపట్టిన వారికి చెక్కులను ఇవ్వాల్సి ఉండగా, అందుకు భిన్నంగా వ్యవహరించినట్లుగా అభియోగాలు పొక్కాయి. విచారణలో తాము ఎలాంటి అవినీతి, అక్రమాలకు పాల్పడలేదంటూ మాజీ సర్పంచ్ చేతనరెడ్డి, ఆమె భర్త రాంచంద్రారెడ్డిలు విచారణ కమిటీ సభ్యులకు వివరించారు. ఎంబీ రికార్డు లేకుండానే డబ్బులను నేరుగా డ్రా చేసిన అంశాలను విచారణ కమిటీ సభ్యులు ప్రశ్నించిన సందర్భంలో గ్రామపంచాయతీ కార్యదర్శికి అన్ని పత్రాలను ఇచ్చినట్లుగా పేర్కొన్నట్లుగా తెలిసింది. ఈ అంశంలో బిల్లులు ఉన్నాయని ఒక పర్యాయం, ఎంబీ రికార్డులు చేశామంటూ మరొక పర్యాయం పొంతన లేకుండా గ్రామపంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహించిన శివప్రసాద్ విచారణ అధికారులకు చెప్పినట్లుగా తెలిసింది.

ఈ నెల 12 లోగా వచ్చిన అభియోగాలకు సంబంధించిన పూర్తి ఆధారాలతో సంజాయిషీ ఇవ్వాలని లేనిపక్షంలో ఫైనల్ రిపోర్ట్‌ను కలెక్టర్‌కు సమర్పించనున్నట్లు ఈ సందర్భంగా డీఆర్డీఏ నర్సింహులు మరొక అవకాశం ఇచ్చారు. ఎలాంటి ఎంబీ రికార్డులు లేకుండా, ఎలాంటి బిల్లులు లేకుండానే, నిబంధనలకు విరుద్ధంగా డబ్బులను డ్రా చేసిన మాజీ సర్పంచ్, అప్పటి గ్రామపంచాయతీ కార్యదర్శిలపై చర్యలు తీ సుకోవాలంటూ గ్రామస్థులు కోరుతున్నారు. ఈ విచారణలో డీఆర్డీఏ పర్యవేక్షకురాలు హేమలత, పోలేపల్లి గ్రామపంచాయతీ ప్రస్తుత కార్యదర్శి లక్ష్మీనారాయణ ఉన్నారు.

ప్రతీ రైతుకు గుర్తింపు కార్డు

▸▸ 14 నెంబర్లతో యూనిక్‌కోడ్ కేటాయింపునకు కేంద్రం నిర్ణయం

▸▸ జిల్లాలో 5 నుంచి వివరాల సేకరణ

▸▸ జిల్లాలో 64 మంది ఏఈవోలతో శ్రీకారం

▸▸ మే నేలాఖరులోపు పూర్తికి వ్యవసాయ శాఖ సన్నాహాలు

▸▸ ఈ ఫార్మర్ ఐడీల కేటాయింపు



నారాయణపేట శివారులో దుక్కిదున్నుతున్న రైతు

నారాయణపేట, మే 3 (ఆంధ్రజ్యోతి): ఆధార్‌తో దేశంలోని ప్రతీ పౌరునికి గుర్తింపు ఇచ్చినట్లుగానే ప్రతీ రైతుకు 14 నెంబర్లతో విశిష్ట సంఖ్య (యూనిక్‌కోడ్)ని కేటాయించాలని కేంద్ర ప్రభుత్వం నిర్వహించింది. దాంతో జిల్లా వ్యాప్తంగా 4,59,000 భూమి ఉండగా 4,25,000 ఎకరాల భూమి సాగుకు యోగ్యంగా ఉంది. 250 రెవెన్యూ గ్రామాలు ఉండగా, 1,92,020 మంది పట్టాదారులున్నారు. 4,84,739 మంది రైతులు ఉన్నారు. జిల్లాలో 76 రైతు వేదికలు ఉండగా 64 మంది ఏఈవోల ఆధ్వర్యంలో రైతుల వివరాలు ఈ నెల 5వ తేదీ నుంచి సేకరించేందుకు శ్రీకారం చుట్టనున్నారు. జిల్లా వ్యవసాయ అధికారి జాన్ సుదాకర్ ఆధ్వర్యంలో ఏఈవోలు రైతులకు సంబంధించిన పూర్తి వివరాలు మొబైల్ యాప్‌లో క్రోడీకరించి నమోదు చేయనున్నారు. కనీసం ఐదు నిమిషాల సమయం రైతు వివరాలు సేకరించేందుకు సమయం పట్టే అవకాశం ఉండటంతో రోజుకు ఒకొక్క ఏఈవో 50 మంది రైతుల వివరాలు సేకరించే అవకాశం ఉంది. ఆయా రైతాంగానికి యూనిక్‌కోడ్ గుర్తింపు కార్డులు అందించేందుకు వ్యవసాయశాఖ కసరత్తులు చేస్తుంది. వ్యవసాయరంగాన్ని పూర్తిగా డిజిటలైజ్ చేయాలనే సంకల్పంతో ఈ ప్రాజెక్టును చేపడ్తుంది. భూమి ఉన్న ప్రతీ రైతుకు తనకు ఉన్న భూములకు సంబంధించిన వివరాలతో కూడిన సమాచారంతో ఈ ఫార్మర్ రిజిస్ట్రీ నిర్మించబడుతుంది. రెవెన్యూశాఖ ద్వారా సేకరించిన భూయాజమాన్య వివరాలను రైతు యొక్క ఆధార్ సంఖ్యను అనుసంధానం చేయడం ద్వారా ఈ ఫార్మర్ ఐడీని కేటాయించడం జరుగుతుంది. ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు ఏరకమైన చట్టబద్ధ యాజమాన్య హక్కును కల్పించదు. కేవలం రెవెన్యూ శాఖ వద్ద ఉన్న భూ యాజమాన్య వివరాలను ప్రామాణికంగా తీసుకొని ఈ రైతులకు ఫార్మర్ ఐడీ కేటాయిండం జరుగుతుంది. కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుకు ఫార్మర్ రిజిస్ట్రేషన్ అనుసంధానం చేయడం జరుగుతుంది. పీఎం కిసాన్ లబ్దిదారులకు తదుపరి విడత లబ్ధి పొందుటకు ప్రామాణికంగా ఫార్మర్ రిజిస్ట్రీలో నమొదు తప్పనిసరి చేస్తూ కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన పథకాలు అయిన రైతు భరోసా రుణమాఫీ తదితర రాష్ట్ర ప్రభుత్వ పథకాలకు ఫార్మర్ రిజిస్ట్రీ ఏ రకమైన సంబంధం లేదు. రైతు విశిష్ట సంఖ్యను (ఫార్మర్ ఐడీ) పొందుటకు మీ ఆధార్, భూ యజమాన్య పాస్ బుక్ ఆధార్‌రు లింక్ చేయబడిన మొబైల్ నెంబర్ తీసుకొని సమీపంలోని వ్యవసాయ అధికారి లేక వ్యవసాయ విస్తరణ అధికారి రైతు వేదికలను ఆశ్రయించి ఫార్మర్ ఐడీకి రిజిస్ట్రేషన్ చేసుకొనే వెసులుబాటు కల్పించారు.

పాలమూరుకు ట్రిపుల్ ఐటీ

(1వ పేజీ తరువాయి)



ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో యెన్నం శ్రీనివాస్‌రెడ్డితో సమావేశమైన బాసర ట్రిపుల్ ఐటీ వీసీ

పాలమూరు ముఖచిత్రం మారిపోయే అవకాశం ఉంది. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి తన ఎన్నికల హామీల్లో భాగంగా జాతీయ సాయి విద్యా సంస్థను నెలకొల్పేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ట్రిపుల్ ఐటీ మంజూరయితే ఆ హామీ నెరవేరనుంది. గతంలో హైదరాబాద్, బాసరలో మాత్రమే ట్రిపుల్ ఐటీలు ఉన్నాయి. ఒకటి పూర్తిగా ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తుండగా.. మరొకటి పబ్లిక్, ప్రైవేట్ పార్టనర్‌షిప్‌లో కొనసాగుతోంది. పాలమూరుకు మంజూరయ్యే ట్రిపుల్ ఐటీ పూర్తిగా ప్రభుత్వ ఆధ్వర్యంలోనే నడవనుంది. ఉమ్మడి పాలమూరు జిల్లా నుంచి ఏటా ఇంజనీరింగ్ చదువుల కోసం హైదరాబాద్, బెంగళూరు వంటి నగరాలకు విద్యార్థులు వలస వెళ్తున్నారు. ఇప్పుడు వనపర్తిలో జేఎన్‌టీయూహెచ్, కొడంగల్‌లో ప్రభుత్వ ఇంజనీరింగ్ కాలేజీ, పాలమూరులో ఇంజనీరింగ్ కాలేజీలు వచ్చాయి. ట్రిపుల్ ఐటీ వస్తే విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుంది. అలాగే ఉన్నతస్థాయి విద్య అందడంతోపాటు వివిధ కంపెనీల్లో ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు కొలువులు సులభంగా లభిస్తాయని చెప్పొచ్చు.

50 ఎకరాల్లో ఏర్పాటు..

ట్రిపుల్ ఐటీకి రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా రెండు మూడు రోజుల్లో జీవో విడుదల చేయనుండగా.. ముందుగా స్థలాన్ని ఎంపిక చేయాల్సి ఉంది. కార్పొరేషన్ పరిధిలోనే ఈ విద్యాసంస్థ ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు చేస్తున్నారు. కనీసం 40 నుంచి 50 ఎకరాల స్థలం అవసరం కానుంది. కళాశాల భవనం, ల్యాబ్‌లు, వర్క్‌షాపులు, లైబ్రరీలు, స్టాఫ్ క్వార్టర్లు, విద్యార్థుల వసతి గృహాలు, సెమినార్ హాల్స్ తదితర సౌకర్యాలు కల్పించాల్సి ఉంటుంది. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు బాసర ట్రిపుల్ ఐటీ వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్ ఆధ్వర్యంలో అధికారులు శనివారం పలు ప్రాంతాల్లో స్థల పరిశీలన చేశారు. పాలమూరులోని దివిటిపల్లి, రాజబహదూర్ రెడ్డి హాస్టల్ సమీపంలో బాసర ట్రిపుల్ ఐటీ వీసీ బృందం, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డితో కలిసి స్థల పరిశీలన చేశారు. వీటితో పాటు మరిన్ని స్థలాలు గుర్తించాలని, ఏది అనువుగా ఉంటుందో దాన్ని ఎంపిక చేస్తామని ఎమ్మెల్యే కలెక్టర్ విజయేందిర బోయికి సూచించారు.

కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి పి.వినోద్ కుమార్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ రెడ్డి, మూడా చైర్మన్ లక్షణ్ యాదవ్, అవేజ్, కృష్ణయ్య యాదవ్, సంజీవ్ రెడ్డి, శ్రీనివాస్ యాదవ్, వెంకటాచారి తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం.. కేసు నమోదు

మిడ్జిల్, మే 3 (ఆంధ్రజ్యోతి) నాగర్‌కర్నూల్ జిల్లాలోని ఓ గ్రామానికి చెందిన యువతి, ఆమె తల్లి గత కొన్ని రోజులుగా మిడ్జిల్ మండలంలోని ఓ గ్రామంలో ఇంటిని అద్దెకు తీసుకొని నివసిస్తుండేవారు. ఈ నెల 3వ తే దీన యువతి ఇంటినుంచి ఎవరికీ చెప్పకుండా తెల్లవారుజామున బయట కు వెళ్లిందని ఎస్సై శివనాగేశ్వర్‌నాయుడు శనివారం తెలిపారు. యువతి కనబడుట లేదని తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యా ప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

సమ్మర్ క్యాంపును వినియోగించుకోవాలి

● ఎంఈవో బాలకిష్టప్ప



మద్దూర్, మే 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సమ్మర్ క్యాంపును వినియోగించుకోవాలని మండల ఉప విద్యాధికారి బాలకిష్టప్ప అన్నారు. శనివారం 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పలు విషయాలను వెల్లడించారు.

సెలవుల నేపథ్యంలో విద్యార్థులకు ఎలాంటి కార్యక్రమాలు చేపట్టారు?

ఆరు నుంచి పదో తరగతి విద్యార్థులకు మే 1 నుంచి 15 వరకు వేసవి క్యాంపు నిర్వహిస్తున్నాం. ఇందులో వివిధ అంశాలపై విద్యాబోధనతో పాటు, చిత్రలేఖనం, స్పోర్ట్స్ తదితర వాటిపై శిక్షణ ఇస్తున్నాం.

పదో తరగతిలో మండలంలో ఎంత శాతం ఫలితాలు వచ్చాయి?

సరాసరి 93 శాతం ఫలితాలు వచ్చాయి. వీటిలో మద్దూర్‌లోని బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థి అత్యధికంగా 567 మార్కులు సాధించాడు.

మండలంలో పీఎంశ్రీకి ఎంపికైన పాఠశాల ఏది?

పీఎంశ్రీ కింద ఎంపికైన పెదిరిపాడ్ పాఠశాలలో పలు మౌలిక సదుపాయాలను ప్రభుత్వం కల్పించింది.

పెదిరిపాడ్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో ఫలితాలు ఎలా ఉన్నాయి?

మండలంలో పెదిరిపాడ్‌లో మాత్రమే ఒక్కటే ఇంగ్లిష్ మీడియం పాఠశాల ఉంది. ఉపాధ్యాయుల కృషి, విద్యార్థుల పట్టుదలతో ఈ సంవత్సరం పదవ తరగతిలో 93 శాతం ఫలితాలు వచ్చాయి.

న్యూస్ బాక్స్

మాజీ సర్పంచ్ మృతికి సంతాపం

నర్వ, మే 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాతర్‌చెడ్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ బోలుబండ కథలప్ప శనివారం ఉదయం అకాల మరణం చెందాడు. విషయం తెలిసిన మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ఆయన పార్థివ దేహంపై పూలమాల వేసి సంతాపం వ్యక్తం చేశారు. కథలప్ప మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని ఎమ్మెల్యే పేర్కొన్నారు. జడ్పీటీసీ మాజీ సభ్యుడు లక్ష్మారెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీసం చెన్నయ్యసాగర్, నాయకులు ఉన్నారు.

జాతీయ సమ్మెలో పాల్గొంటాం

నారాయణపేట, మే 3 (ఆంధ్రజ్యోతి): ఈనెల 20న జరిగే దేశవ్యాప్త జాతీయ సమ్మెలో ఆశ వర్కర్లు పాల్గొంటారని సీఐటీయూ నాయకులు వెంకట్రామిరెడ్డి, బాల్‌రామ్, ఆశ వర్కర్ల సంఘం జిల్లా అధ్యక్షురాలు బాలమణి తెలిపారు. ఈ మేరకు శనివారం డీఎంహెచ్‌వో జయచంద్ర మోహన్‌కు వారు సమ్మె నోటీసును అందించారు. అనంతరం మాట్లాడుతూ కేంద్రం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా సమ్మె చేస్తున్నామన్నారు. సవరించిన 29 కార్మిక చట్టాలను రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో శ్రీదేవి, పార్వతి ఉన్నారు.

కాకర్ల భీమయ్యకు డాక్టరేట్

నారాయణపేట, మే 3 (ఆంధ్రజ్యోతి): నారాయణపేటకు చెందిన అఖిల భారత అయ్యప్ప ప్రచార సమితి జిల్లా అధ్యక్షుడు కాకర్ల భీమయ్య తమిళనాడు గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ వారు శనివారం కన్యాకుమారి వివేకానంద కేంద్ర క్యాంపస్‌లో డాక్టరేట్ అందుకున్నారు. కాకర్ల భీమయ్య గత 20 ఏళ్లుగా చేస్తున్న సామాజిక, ఆధ్యాత్మిక సేవలను గుర్తించి యూనివర్సిటీ చైర్మన్ య్యానుల్, వైస్ చైర్మన్ వెంకటేషన్ డాక్టరేట్‌ను ప్రదానం చేసి, మాట్లాడారు. సామాజిక, ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలు చేస్తున్న కాకర్ల భీమయ్యను ప్రత్యేకంగా అభినందించారు.

పశువులకు టీకాలు వేయించాలి

ఊట్కూర్, మే 3 (ఆంధ్రజ్యోతి): పశువులకు క్రమం తప్పకుండా టీకాలు వేయించాలని పశువైద్యుడు సాయివరుణ్ తెలిపారు. మండలంలోని చిన్నపొర్ల గ్రామ పశువైద్యశాలలో శనివారం గాలికుంటు వ్యాధి నివారణ కోసం పశువైద్య శిబిరం నిర్వహించారు. శిబిరానికి చిన్నపొర్ల, పెద్దపొర్ల గ్రామాల్లోని రైతులు తమ పశువులను తీసుకొచ్చి ఎఫ్ఎండీ టీకాలను వేయించారు. సీజనల్‌గా వచ్చే వ్యాధుల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని పశువైద్యులు సూచించారు. జీవీవో రాధిక, వెటర్నరీ అసిస్టెంట్ శివకుమార్, ఏఎస్‌వో రాఘవరెడ్డి, వెంకటేష్ పాల్గొన్నారు.

భగత్‌సింగ్ విగ్రహావిష్కరణ వాల్‌పోస్టర్ విడుదల

ఊట్కూర్, మే 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అవసులోన్‌పల్లి గ్రామంలో సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ పార్టీ నాయకులు శనివారం భగత్‌సింగ్ విగ్రహావిష్కరణ వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. సోమవారం మక్తల్ పట్టణంలో విగ్రహావిష్కరణ ఉంటుందని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు, యువకులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న 'ఉపాధి' ఉద్యోగుల పెన్‌డౌన్

ఊట్కూర్, మే 3 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోసం ఉపాధి ఉద్యోగులు చేపట్టిన పెన్‌డౌన్ శనివారం నాలుగో రోజుకు చేరింది. ఉద్యోగులు ఎంపీడీవో కార్యాలయం ముందు నినాదాలు చేస్తూ తమ నిరసనను తెలిపారు. జేఏసీ కన్వీనర్ సత్యప్రకాష్, ఈసీ మహిపాల్, కంప్యూటర్ ఆపరేటర్లు, టీఏలు తదితరులున్నారు.

ప్రమాదపుటంచున సీసీ రహదారి

» పట్టించుకోని అధికారులు

మాగనూరు, మే 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొల్పూరు గ్రామంలో హరిజనవాడకు వెళ్లే సీసీ రోడ్డు ప్రమాదపుటంచుల్లో ఉంది. ఈ రోడ్డుపై ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. కృష్ణ మండలం ముడుమాల్ నుంచి కొల్పూరు గ్రామానికి వేసిన బీటీ రోడ్డు మధ్యలో హరిజనవాడకు అంతర్గత సీసీ రహదారి నిర్మించారు. హరిజనవాడలో వేసిన సీసీ వర్షపు నీటితో రోడ్డు అడుగుభాగాన మట్టి కొట్టుకుని పోయి ప్రమాదకర స్థితికి చేరుకున్నది. ఈ విషయంపై గతంలో ఉన్న సర్పంచుకు, పంచాయతీ స్పెషల్ ఆఫీసర్‌కు, కార్యదర్శికి తెలిపినా ఎవరు పట్టించుకోలేదని గ్రామస్థులు పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో స్థానికులకు పలు సమస్యలను పరిష్కరిస్తామని హామీలు ఇస్తారే తప్పా గెలిచిన తర్వాత ఏ ప్రజా ప్రతినిధి పట్టించుకోరని వారు వాపోయారు. ఇప్పటికైనా స్పందించి సీసీ అడుగుభాగాన మరమ్మతులు చేయాలని, లేకపోతే రోడ్డును ధ్వంసం చేసి మళ్లీ సీసీ వేయాలని కాలనీవాసులు అధికారులు, ప్రజాప్రతినిధులను కోరుతున్నారు.



కొల్పూరు గ్రామంలో ప్రమాదపుటంచున హరిజనవాడకు వెళ్లే సీసీ రోడ్డు

నిధుల కొరతతో మరమ్మతులు చేయలేకపోతున్నాం..



సర్పంచుల కాల పరిమితి ముగిసిన నాటి నుంచి నేటి వరకు గ్రామ పంచాయతీల్లో నిధుల కొరత ఉంది. స్థానిక ప్రజలు విషయాన్ని మా దృష్టికి తీసుకువచ్చారు. గ్రామంలోని ఏ మరమ్మతులు చేయాలన్న సొంత నిధులతో చేయాల్సి వస్తోంది. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైన తర్వాత మరమ్మతు చేయిస్తాం.

-ఎస్.భాస్కర్, పంచాయతీ కార్యదర్శి

జాబ్ మేళా విజయవంతం



జాబ్‌మేళాలో ఉద్యోగాలు పొందిన మహిళలతో రాజ్‌కుమార్‌రెడ్డి

నారాయణపేటటౌన్, మే 3 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా కేంద్రంలో భీష్మరాజ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన మెగా జాబ్‌మేళా విజయవంతమైంది. చైర్మన్ డాక్టర్ కె.రాజ్‌కుమార్‌రెడ్డి నేతృత్వంలో పట్టణంలోని ఎస్ఆర్ గార్డెన్స్‌లో నిర్వహించిన మెగా జాబ్ మేళాకు జిల్లాతో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన వందలాది మంది నిరుద్యోగ యువతీ, యువకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి, మేళాను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ తాను పుట్టిన గడ్డను అభివృద్ధి చేసుకునే క్రమంలో ఈ మేళాను ఏర్పాటుచేసినట్లు తెలిపారు. ఇప్పటికే పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం, ల్యాప్‌టాప్‌ల అందజేత, అనారోగ్యంతో బాధపడుతున్న వారికి వైద్య సేవలు అందించడం, అనేక దేవాలయాల పునర్నిర్మాణాలకు సహకరించానని పేర్కొన్నారు.

నిరుద్యోగుల నుంచి భారీ స్పందన

భీష్మరాజ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణంలో నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు నిరుద్యోగుల నుంచి విశేష స్పందన లభించింది. మేళా నిర్వహించి ఎంతోమందికి ఉద్యోగాలు కల్పించడంపై అభ్యర్థులు, కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. 380 మంది ఉద్యోగాలకు ఎంపిక కాగా అందులో 80 మందికి ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు. అంతకుముందు నిర్వాహకులు వివిధ కంపెనీల ప్రతినిధులను, అధ్యాపకులను, ఫౌండేషన్ సభ్యులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. అధ్యాపకులు మణిమాల, వేణుగోపాల్, అంజయ్య తదితరులున్నారు.

ఎస్సెస్సీ, ఇంటర్ ఫలితాల్లో కేజీబీవీ విద్యార్థినుల హవా

» ఇంటర్‌లో నర్వ కస్తూర్బా విద్యార్థినికి రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంకు

» పదో తరగతిలో జిల్లా టాపర్‌గా కృష్ణ విద్యార్థిని

» ఏడు కేజీబీవీలలో వందశాతం ఉత్తీర్ణత

నారాయణపేట, మే 3 (ఆంధ్రజ్యోతి): ఎస్సెస్సీ, ఇంటర్ ఫలితాల్లో కస్తూర్బా విద్యార్థినులు హవా కొనసాగించారు. జిల్లాలో మొత్తం 11 కేజీబీవీలు ఉన్నాయి. ఊట్కూర్ మండలం పులిమామిడిలో కొనసాగుతున్న కస్తూర్బా పాఠశాలలో ఇంటర్, పదో తరగతి ఫలితాల్లో విద్యార్థినులు వందశాతం ఉత్తీర్ణత సాధించారు. ఇక్కడి కేజీబీవీలో వందశాతం ఉత్తీర్ణతపై విద్యాభిమానులు బోధకులు, విద్యార్థినులను అభినందిస్తున్నారు. ఇంటర్ ఫలితాల్లో నర్వ కేజీబీవీ విద్యార్థిని బి.అశ్విని సీఈసీ గ్రూప్‌లో 962 మార్కులతో స్టేట్ టాపర్‌గా నిలవడం విశేషం. పదో తరగతి ఫలితాల్లో జిల్లా టాపర్‌గా కృష్ణ కేజీబీవీకి చెందిన విద్యార్థిని సి.రేఖ 568 మార్కులు సాధించింది. జిల్లాలో ఏడు కస్తూర్బాలు పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించగా, ఇంటర్‌లో ఒకే ఒక్క ఊట్కూర్ కేజీబీవీ వంద శాతం ఉత్తీర్ణత సాధించింది. అలాగే జిల్లాలోని 18 ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించారు.



పదో తరగతి జిల్లా టాపర్ కృష్ణ కస్తూర్బా విద్యార్థిని సి.రేఖ



ఇంటర్ సీఈసీ స్టేట్ ఫస్ట్ నర్వ కస్తూర్బా విద్యార్థిని అశ్విని

డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చాలి : ఆర్డీవో



డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చాలని పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అధికారులు

నారాయణపేటటౌన్, మే 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మాదక ద్రవ్యాల నిషేధాన్ని పకడ్బందీగా అమలు చేసి డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చాలని ఆర్డీవో రాంచందర్‌నాయక్ అన్నారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్‌లోని వీసీ హాల్‌లో మాదక ద్రవ్యాల నిషేధంపై ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో గంజాయి సాగు జరగకుండా వ్యవసాయ శాఖ అధికారులు ప్రత్యేక నిఘా పెట్టాలని సూచించారు. జిల్లాలోని అన్ని జూనియర్, డిగ్రీ కళాశాలల్లో యాంటీ డ్రగ్స్ కమిటీల ద్వారా మాదక ద్రవ్యాల నిషేధంపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. ఉన్నత పాఠశాలల్లోను అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. డీఎస్పీలు నల్లపు లింగయ్య, బుచ్చయ్య, ఆర్డీవో మేఘాగాంధీ, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ వినయ్‌కుమార్, ఎక్సైజ్ సీఐలు పురుషోత్తంరెడ్డి, గురువయ్య, వైద్య ఆరోగ్య శాఖ అధికారి భిక్షపతి, సీ-సెక్షన్ అధికారి పాల్గొన్నారు. అనంతరం టీజీ యాంటీ నార్కోటిక్ బ్యూరో ఆధ్వర్యంలో డ్రగ్స్ నిషధంపై అవగాహన కల్పించేందుకు ముద్రించిన వాల్ పోస్టర్లను అధికారులు ఆవిష్కరించారు.

డ్రైవింగ్ సమయంలో అప్రమత్తంగా ఉండాలి

» ఆర్ఎస్ఐ శివశంకర్



డ్రైవర్లతో మాట్లాడుతున్న ఆర్ఎస్ఐ శివశంకర్

నారాయణపేట, మే 3 (ఆంధ్రజ్యోతి): పోలీస్ వాహనాలు నడిపే సమయంలో డ్రైవర్లు అప్రమత్తంగా ఉండి డ్రైవింగ్ చేయాలని ఆర్ఎస్ఐ శివశంకర్ అన్నారు. శనివారం నారాయణపేట ఎస్పీ కార్యాలయంలో జిల్లాలోని పోలీస్ మోటార్ వాహన డ్రైవర్లకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. పోలీస్‌స్టేషన్‌లలో పెట్రోలింగ్ చేసే వాహన డ్రైవర్లు రాత్రివేళల్లో నిర్విరామంగా తమకు కేటాయించిన సమయాల్లో విధులు నిర్వహిస్తూ నేరస్తులపై నిఘా ఏర్పాటు చేయాలన్నారు. ముందస్తు నేరాలు జరుగకుండా చూడాలన్నారు. సైరన్ వేసుకుంటూ పెట్రోలింగ్ చేయాలన్నారు.

రైస్‌మిల్లుల తనిఖీ



రైస్ మిల్లును పరిశీలిస్తున్న డీఎస్‌వో బాలరాజు

కృష్ణ, మే 3 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అన్ని రైస్‌మిల్లులను డీఎస్‌వో బాలరాజు శనివారం తహసీల్దార్‌తో కలిసి తనిఖీ చేశారు. ధాన్యం బస్తాలు లోడుతో జాతీయ రహదారిపై బైఠాయించడంతో జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు రైస్ మిల్లులను, గోడౌన్‌ను పరిశీలించి, యాజమాన్యం ద్వారా వివరాలు సేకరించారు. ట్రాక్టర్, లారీలు, వరి లోడుతో ఉన్న వాహనాలు వెంటనే లేబర్ ద్వారా ఖాళీ చేయించి తిరిగి వాహనాలు పంపే విధంగా చూడాలని మిల్లర్ల యాజమాన్యాలకు వారు ఆదేశాలు జారీ చేశారు.

కష్టపడ్డ వారికే పదవులు

నారాయణపేట, మే 3 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పాటుకు కృషి చేసిన వారికే పార్టీ పదవులు దక్కుతాయని మాజీ మార్కెట్ చైర్మన్ బండి వేణుగోపాల్ అన్నారు. శనివారం నారాయణపేట 22 వార్డులో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన పేర్కొన్నారు. అనంతరం వార్డు కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

సైబర్ నేరాలు, దొంగతనాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

నారాయణపేట, మే 3 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలు, దొంగతనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని షీ టీం పోలీసు బాల్‌రాజ్ అన్నారు. శనివారం నారాయణపేట ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులనుద్దేశించి ఆయన మాట్లాడారు. సైబర్ నేరగాళ్ల చూపే మోసపూరిత ఆశలకు గురి కావొద్దన్నారు. సైబర్ నేరానికి గురైతే 1930 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేయాలన్నారు. జ్యోతి, కవిత ఉన్నారు.

సమ్మర్ క్యాంపును వినియోగించుకోవాలి

దామరగిద్ద, మే 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పీఎంశ్రీ జడ్పీహెచ్ఎస్‌లో యంగ్ ఇండియా సమ్మర్ క్యాంపును వినియోగించుకోవాలని కమ్యూనిటీ మొబైలేజేషన్ ఆఫీసర్ రాజేంద్రప్రసాద్, మధ్యాహ్న భోజన ఇన్‌చార్జి యాదయ్యశెట్టి అన్నారు. శనివారం పాఠశాలలో కొనసాగుతున్న సమ్మర్ క్యాంపును వారు సందర్శించి, మాట్లాడారు. జీహెచ్ఎం అశోక్, అమృత్, నారాయణ, శంభులింగం, వెంకటప్ప పాల్గొన్నారు.

బీఎస్పీ పోరాట ఫలితమే బీసీ కులగణన

మక్తల్‌రూరల్, మే 3 (ఆంధ్రజ్యోతి): 40 ఏళ్ల బీఎస్పీ పోరాట ఫలితమే నేడు బీసీ కులగణనకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నదని ఆ పార్టీ నారాయణపేట జిల్లా అధ్యక్షుడు బొదిగెలి శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం మక్తల్ పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్ల కోసం, కుల గణన కోసం బీఎస్పీ పోరాటానికి తలొగ్గి నాటి ప్రభుత్వం మండల్ కమిషన్ వేస్తే బీసీ రిజర్వేషన్లను వ్యతిరేకిస్తూ దేశ వ్యాప్తంగా బీజేపీ కమండల్ ఉద్యమాన్ని చేసిందని గుర్తు చేశారు. బీజేపీ మొదటి నుంచి బీసీ రిజర్వేషన్లకు, కులగణనకు వ్యతిరేకమన్నారు. సమావేశంలో బీఎస్పీ జిల్లా కార్యదర్శి బండారి చంద్రశేఖర్, మక్తల్ అసెంబ్లీ ఇన్‌చార్జి పాలెం వెంకటయ్య, నియోజకవర్గ అధ్యక్షుడు గువ్వల తిరుపతి, సోషల్ మీడియా ఇన్‌చార్జి అశోక్, నాయకులు ఉన్నారు.

వర్షానికి తడిసిన ప్రతీ గింజను కొనుగోలు చేయాలి

నారాయణపేటటౌన్, మే 3 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షానికి గాను తడిసిన ప్రతీ ధాన్యపు గింజను ఎలాంటి నిబంధనలు లేకుండా ప్రభుత్వం కొనుగోలు చేయాలని, అలాగే కొనుగోలు కేంద్రాల వద్ద గన్నీ బ్యాగుల కొరత లేకుండా చూడాలని టీకేఎస్ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం సంఘం జిల్లా అధ్యక్షుడు కావలి వెంకటేష్, కార్యదర్శి అనంతరెడ్డి తదితరులు సివిల్ సప్లై డీఎం సైదులుకు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కాళేశ్వరంమూర్తి, సహాయ కార్యదర్శులు ప్రభు మిస్కిన్, మహిపాల్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు ఉన్నారు.

కొనసాగుతున్న ఉత్సవాలు

మరికల్, మే 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన దత్తలింగేశ్వరస్వామి ఆలయంలో శనివారం రెండో రోజు విగ్రహాల ప్రతిష్ఠాపనకు గాను అర్చకులు పలువురి దంపతులతో హోమాలు నిర్వహించారు. ఆదివారం విగ్రహాల ప్రతిష్ఠాపన ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు చైతన్య, రాములు తెలిపారు.

పంచలోహ విగ్రహాలకు జలాభిషేకం

» అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న ఎమ్మెల్యే



అభయాంజనేయస్వామి దేవాలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

కృష్ణ, మే 3 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గుడెబల్లూరు గ్రామ పంచాయతీ శివారులోని చెక్‌పోస్టు వద్ద నిర్మించిన అభయాంజనేయస్వామి దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనలో మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి శనివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన పంచలోహ విగ్రహాలకు జలాభిషేకం చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు ఎమ్మెల్యేను ఆశీర్వదించి ప్రసాదాలను అందజేశారు. అలాగే ఎమ్మెల్యే, నాయకులను ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, శాలువా పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు లక్ష్మారెడ్డి, నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

అభివృద్ధికి అందరూ కలిసి రావాలి

» నారాయణపేట జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ వార్ల విజయ్‌కుమార్



బ్రిడ్జి నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న నాయకులు

కోస్గి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి కోసం అందరు కలిసిరావాలని, వెనకబడిన కొడంగల్‌ను అభివృద్ధి చేసుకునేందుకు అవకాశం వచ్చిందని నారాయణపేట జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ వార్ల విజయ్‌కుమార్ అన్నారు. శనివారం మీర్జాపూర్-పీసీతండా రహదారిలో నిర్మిస్తున్న బ్రిడ్జి, ముంగిమళ్ల వద్ద నిర్మిస్తున్న మరో బ్రిడ్జి నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి సహకారంతో కోట్ల రూపాయల నిధులు కొడంగల్‌కు వస్తున్నాయని అన్నారు. గతంలో నియోజకవర్గానికి నిధులు రాక, అభివృద్ధి చెందక పూర్తిగా వెనకబాటుతనానికి గురైందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రఘువర్ధన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గిరిప్రసాద్‌రెడ్డి, నాయకులు హన్మంత్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, సుధాకర్‌గౌడ్, విద్యాసాగర్ ఉన్నారు.

మహిళా సాధికారతకు కృషి చేయాలి

» సీనియర్ సివిల్ న్యాయాధికారి, లీగల్ సర్వీసెస్ సంస్థ కార్యదర్శి వింధ్యనాయక్



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ న్యాయాధికారి వింధ్యనాయక్

నారాయణపేటటౌన్/నారాయణపేట రూరల్, మే 3 (ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారత కోసం కృషి చేయాలని సీనియర్ సివిల్ న్యాయాధికారి, లీగల్ సర్వీసెస్ సంస్థ కార్యదర్శి వింధ్యనాయక్ అన్నారు. జిల్లా మహిళా సాధికారత కేంద్రం సింగారం వద్ద జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ప్రధాన న్యాయమూర్తి, లీగల్ సర్వీసెస్ సంస్థ చైర్మన్ బోయ శ్రీనివాసులు ఆదేశాల మేరకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి వింధ్యనాయక్, అడిషనల్ కలెక్టర్ సంచిత్ గంగ్వార్ హాజరై, మాట్లాడారు. భారతీయ మహిళా కేంద్రీకృత చట్టాలు, మహిళా కేంద్రీకృత నిబంధనలపై లోపాలు, ప్రాథమిక హక్కులు, శిక్షల గురించి వివరించారు. కార్యక్రమంలో బాలల సంక్షేమ మండలి చైర్మన్ అశోక్, శ్యామల, చిల్డ్రన్స్ చట్టాలు, పీపీ సురేష్, బీఎన్ఎస్ యాక్ట్ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ లక్ష్మీపతిగౌడ్ పాల్గొన్నారు.

అదేవిధంగా, పేట మండలంలోని బోయిన్‌పల్లి, అప్పక్‌పల్లి గ్రామాల్లో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ కె.లక్ష్మీపతిగౌడ్ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి అసిస్టెంట్ పీపీ కె.సురేష్ హాజరై, ప్రజలకు భారత రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కుల గురించి, విధుల గురించి వివరించారు. అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎస్.నాగేశ్వరి, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలి

దామరగిద్ద, మే 3 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి లారీల ద్వారా రైస్ మిల్లులకు తరలించాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి అంజిలయ్యగౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. శనివారం దామరగిద్ద మండలం పిడేంపల్లి, నర్సాపూర్, అన్నసాగర్ గ్రామాల్లో రైతు సంఘం జిల్లా బృందం ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించింది. ఈ సందర్భంగా వారు రైతులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం అంజిలయ్యగౌడ్ మాట్లాడుతూ రైతులకు సరిపడా గోనె సంచులు, కాంటాలు అందుబాటులో ఉంచాలని కోరారు. కాంటాలు వేసిన ధాన్యాన్ని తరలించేందుకు లారీలు రాక వారంరోజులుగా రైతులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, వెంటనే లారీలు ఏర్పాటు చేసి ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని లేకపోతే రైతులతో కలిసి ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు నర్సింహ్మా, బాల్‌రాజ్, శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి తదితరులున్నారు.

ఈనెల 7న అనుగొండలో మెగా వైద్య శిబిరం

మక్తల్‌రూరల్, మే 3 (ఆంధ్రజ్యోతి): మక్తల్ మండలంలోని అనుగొండ గ్రామంలో ఈనెల 7న లయన్స్‌క్లబ్ మక్తల్ ఆధ్వర్యంలో లయన్స్ డిస్ట్రిక్ట్ సెకండ్ గవర్నర్ శశికాంత్, లక్ష్మణ్ సహకారంతో మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నామని క్లబ్ మక్తల్ అధ్యక్షుడు డీవీ.చారి తెలిపారు. శనివారం మక్తల్ లయన్స్‌క్లబ్ భవనంలో ఆయన శిబిరం కరపత్రాలను ఆవిష్కరించి, మాట్లాడారు. శిబిరంలో మలక్‌పేట యశోద హాస్పిటల్ వైద్య సిబ్బందితో పాటు, అన్ని విభాగాలకు చెందిన ఇతర వైద్య నిపుణులు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో మహబూబ్‌నగర్ లయన్స్‌క్లబ్ సభ్యులు రాములు, లక్ష్మణ్, మక్తల్ లయన్స్‌క్లబ్ కోశాధికారి అంజన్‌ప్రసాద్, అనుగొండ శ్రీనివాస్, సూగూరు జైపాల్‌రెడ్డి, నాగరాజు తదితరులున్నారు.

'పది' మండల టాపర్లకు సన్మానం



విద్యార్థులను సన్మానిస్తున్న తపస్ నాయకులు

ఊట్కూర్, మే 3 (ఆంధ్రజ్యోతి): 'పది' ఫలితాల్లో మండల టాపర్లుగా నిలిచిన మండలంలోని పెద్దజట్రం గ్రామ ఉన్నత పాఠశాల విద్యార్థులు శిరీష, బాలకృష్ణలను శనివారం తెలంగాణ ప్రాంతీయ ఉపాధ్యాయ సంఘం నాయకులు గ్రామంలో ఘనంగా సన్మానించారు. అలాగే, 2024 డీఎస్సీలో ఉద్యోగాలు సాధించిన తిమ్మప్ప, రేణమ్మలను శాలువాలతో సన్మానించారు. తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నరసింహ, సమన్వయకర్త నర్సింగప్ప, మండల ప్రధాన కార్యదర్శి గోపాల్, మీడియా ఇన్‌చార్జి కిరణ్, నాయకులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని మహిళ మృతి

మరికల్, మే 3 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొని మహిళ మృతి చెందిన సంఘటన మరికల్ మండల కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. మండల కేంద్రానికి చెందిన తిరుపతమ్మ స్థానికంగా ఉన్న హోటళ్లలో కూలీ పని చేసుకుంటు జీవనం కొనసాగిస్తు ఉండేది. శనివారం రాత్రి 7:30 గంటలకు తన సొంత పని నిమిత్తం రాయిచూర్ రోడ్డుకు వెళ్లింది. పని ముగించుకుని రోడ్డు దాటుతుండగా అతివేగంగా వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఎస్ఐ రాములు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఈమెకు ఇద్దరు కూతుళ్లు ఉండగా ఒక కూతురు వివాహం చేసింది. రెండవ కూతురు చదువుకుంటోంది. కాగా, మహిళ మృతిపై ఎవరూ ఫిర్యాదు చేయలేదని పోలీసులు తెలిపారు.

దాడి చేసిన వ్యక్తికి రిమాండ్

కోస్గి రూరల్, మే 3 (ఆంధ్రజ్యోతి): దాడి చేసిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కోస్గి ఎస్ఐ బాల్‌రాజ్ తెలిపిన వివరాల ప్రకారం గుండుమాల్ మండల కేంద్రానికి చెందిన మెత్కు అనంతరెడ్డి శుక్రవారం సాయంత్రం పొలం పనులు ముగించుకొని ఇంటికి వస్తున్న క్రమంలో అదే గ్రామానికి చెందిన తిర్లాపురం రాంరెడ్డి మెత్కు అనంతరెడ్డి మెడపై బలంగా కొట్టడంతో కుప్పకూలిపోయాడు. అక్కడే పొలం పనులు చేసుకుంటున్న హన్మంత్‌రెడ్డి, అనసూయలు మెత్కు అనంత్‌రెడ్డిని కాపాడబోయేందుకు ప్రయత్నించగా వారిని కూడా తిర్లాపురం రాంరెడ్డి రాయితో కొట్టి గాయపరిచాడు. శనివారం దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు తిర్లాపురం రాంరెడ్డిని అరెస్టు చేసి మహబూబ్‌నగర్ కోర్టులో ప్రవేశపెట్టగా మెజిస్ట్రేట్ నిందుతునికి 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్ఐ వివరించారు. పాత కక్షల నేపథ్యంలోనే ఈ దాడి జరిగినట్లు ఎస్ఐ తెలిపారు.